

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 157 | శనివారం 13 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## పోలీస్ స్టేషన్ ఎదుట స్నానం చేసిన జేసీ ప్రభాకర్ రెడ్డి...










# వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!:



**తిరుపతిలో 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' సభలో పాల్గొన్న సీఎం చంద్రబాబు**

**గత ఐదేళ్ల పాలన రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెడుతోందని వ్యాఖ్య**

**సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడుల గురించి వివరించిన ముఖ్యమంత్రి**

**ప్రధాని మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కొనియాడిన చంద్రబాబు**

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా, మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ**



తిరుపతి వేదికగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి (ఎన్డీఏ) ప్రభుత్వం 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్డీఏ కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేసి, రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన ప్రగతిని, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల ముందుంచారు.

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు



**రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది**

**రాయలసీమను రాయల్ సీమగా మార్చాం**

**మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి**

**తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు**

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను

## అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

**ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీతో రక్తహీనతను నివారించవచ్చన్న అమిత్ షా**

**80 కోట్ల మందికి ఉచితంగా పోషకాలు నింపిన బియ్యం పంపిణీ**

**2028 డిసెంబర్ వరకు పథకాన్ని పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం**

**ఈ పథకం కోసం రూ. 17,082 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం**



## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు: కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్



**రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మీనాక్షి నటరాజన్ పిటిషన్ కొట్టివేత**

**ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు**

**దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతుందో ఈ ఘటనతో వెల్లడైందని వ్యాఖ్య**

## ఇన్‌చార్జ్‌లే దిక్కు!

**జిల్లాలో ఇన్‌చార్జుల పాలన.. డీఆర్వో పోస్టు భర్తీ ఎప్పుడో ?**

**బీసీ సంక్షేమ శాఖలు ఖాళీ .. విద్యోను సత్కారాల్లేవు**



## తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది



**ఇటీవల పవన్ సభకు అనుమతి నిరాకరించిన తెలంగాణ ప్రభుత్వం**

**శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయమే అన్న రేవంత్**

**ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య**

తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని, పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని

## చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలి: బుద్దా వెంకన్న

**కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ**

**వయసు పెరిగినా చంద్రబాబు రాష్ట్రం కోసం శ్రమిస్తున్నారని కితాబు**



# ఇన్‌చార్జ్‌లే దిక్కు!

జిల్లాలో ఇప్పటికే పరిశ్రమల కేంద్రం జీఎం, జలవనరులశాఖ ఎస్ఈ, డీఆర్వో పోస్టులు ఖాళీగా ఏర్పడి చాలాకాలం అవుతోంది. జల వనరులశాఖ ఈఈ సీహెచ్ దేవప్రకాశ్ ఎస్ఈగా, కృష్ణాజిల్లా పరి శ్రమల కేంద్రం జీఎం వెంక్రటావు ఏలూరుకు ఇన్‌చార్జిగా, కలెక్టరేట్ లోనే సివిల్ సప్లయ్స్ విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకీ దేవి డీఆర్వోగా ఈ ముగ్గురు పూర్తి అదనపు బాధ్యతలను మోస్తు న్నారు. మరోవైపు సీపీవో వాసుదేవరావును కలెక్టర్ జనవరిలో సరెం డర్ చేయగా, అప్పటి నుంచి కార్యాలయ ఏడీ శ్రీదేవి ఇన్‌చార్జి సీపీ వోగా వ్యవహరిస్తున్నారు. ఈమె ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్నారు. తర్వాత ఈ పోస్టులో మరొకరు ఇన్‌చార్జి ఇవ్వాల్సి ఉం టుంది. కాగా గత నెలాఖరున బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, బీసీ సంక్షేమాధికా రి ఆర్‌వీ నాగ రాణి, సెట్వెల్ సీఈవో ప్రభాకర్‌రావు ఉద్యోగ విరమ ణ చేశారు. ఇందులో పుష్పలత, ప్రభాకర్‌రావు కార్పొ రేషన్‌లకు చెందిన వారు కావడంతో వారికి రెండేళ్ల ఉద్యోగ విరమణ వయస్సు పెంచుతారని భావించినా అదీ జరగలేదు. దీంతో వారిద్దరు ఉద్యోగ విరమణ చేశారు. ఒకవేళ వయో పరిమితి పెంచితే ఇక్కడకు మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం అనుమానంగానే చెబుతున్నారు. ఇదిలా ఉండగా బీసీ కార్పొరేషన్ ఈడీగా సాంఘిక సంక్షేమశాఖ జేడీ విశ్వమోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి ఇన్‌చార్జిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటిలకు బాధ్య తలు అప్పగిస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. సెట్‌వెల్ ఇన్‌చార్జి సీఈవోగా ఉపాధి కల్పనాధికారి పీవీ రమేష్‌బాబుకు అప్పగించగా, మైనా ర్టీ కార్పొరేషన్ అధికారి బాధ్యతలు కూడా ఈయనకే ఇన్‌చార్జిగా అప్పగిం చారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ, డీసీహెచ్ఎస్ పోస్టులు ఖాళీ ఏర్పడగా, ఇన్‌చార్జులు ఈ బొధ్యతలను మోస్తున్నారు.

**డీఆర్వో పోస్టు భర్తీ ఎప్పుడో?** జనవరిలో ఖాళీ ఏర్పడిన డీఆర్వో పోస్టు ఐదు నెలలుగా ఖాళీగానే ఉంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఇటీవల పెద్దఎత్తున బదిలీలు, పదోన్న తులను ప్రభుత్వం కల్పించినా ఈ పోస్టు ఇంకా భర్తీ కాలేదు. కర్నూలు నుంచి ఐసీడీఎస్ ఆర్‌జేడీని నియమిస్తే ఆమె విధుల్లో చేరలేదు. దీంతో ఈ పోస్టు భర్తీ ఎప్పుడో అని ఇన్‌చార్జి డీఆర్వో ఎదురు చూస్తు న్నారు.

**ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారాలు తూచ్** జిల్లాలో రెండేళ్ల నుంచి ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు కనీసం వీడ్కోలు సభలను కూడా యంత్రాంగం నిర్వహించకపోవడం తీవ్ర విమ ర్శలకు తావిస్తోంది. బదిలీలపై వెళ్లిన వారికి కూడా వారు కొత్తస్థానంలో చేరాక అయినా వారిని గౌరవించి, ఒక శాలువా, మెమెంటో ఇచ్చి వీడ్కోలు సభను నిర్వహించేవారు. ఇదిలా ఉండగా కొద్దినెలలు క్రితం బదిలీపై వెళ్లిన జేసీ ధాత్రిరెడ్డి మొదలుకుని ఇతర అధికారులకు కలెక్టర్, ఇతర అధికారులు కనీసం వీడ్కోలు సభను నిర్వహించక పోవడం తీవ్ర చర్చనీయాంశమైవుతోంది. ఎన్నో ఏళ్లుగా ఎక్కడెక్కడో సర్వీసు చేసి, చివరగా ఉద్యోగ విరమణ రోజు నిరాశతో ఎవరికి చెప్పకుండా రిలీవ్ అయిపోవడం ఎంతవరకు సమంజసం అన్న చర్చ సాగుతోంది. జిల్లా అధికారుల అసోసియేషన్ కింద పలుశాఖల అధికారులతో కార్యవర్గం ఉన్న లేనట్లేగా ప్రస్తుత పరిస్థితులు గోచరిస్తున్నాయి. ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీసంగా ఒక శాలువా కప్పి సత్కరించే ఆచారం ఎందుకు మరిచారో మిస్టరీగానే మారింది. దీన్ని కొనసాగించే దిశగా యంత్రాంగం పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

**ఏమిటీ ఫోర్టిఫైడ్ బియ్యం?** ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు.

**ఎందుకింత ప్రాధాన్యం?** భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (చీఖీసూ-5) గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే, ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ₹17,082 కోట్లు కేటాయించింది.

# సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు: కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్

రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్'... రాజకీయ పార్టీల సహకారం కోరిన సీఈఓ

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, జాబితాలోని అవకతవకలను తొలగించి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ విధివిధానాలను వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి వివిధ దశల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారు. అనంతరం స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు.

## చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలి: బుద్దా వెంకన్న

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించగా... పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించి రాష్ట్రం శాంతి, సుభిక్షాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బుద్దా వెంకన్న... ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి మరింత పురోగతి అందించేలా చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే గత ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవకతవకలను ప్రజలు గమనించారని, అందుకే ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కూటమికి బలమైన మద్దతు అందించారని గుర్తుచేశారు. వరదలు వంటి ప్రకృతి విపత్తులను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. వయసు పెరిగినా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు.

## తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది: రేవంత్ రెడ్డి

ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు. ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# ప్రజలు అధికారంతో పాటు .. అతి పెద్ద బాధ్యత అప్పగించారు

**ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ**

**గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది**

**సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు**

**సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం**

**యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి**

**రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.



# వాళ్లకు ఎలాంటి విజన్ లేదు... పాయిజన్ మైండ్!:

తన రాజకీయ ప్రస్థానం మొదలైన తిరుపతిలో, ఏడుకొండలస్వామి చెంతన ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందని, ఇది తనకు పునర్జన్మ లాంటిదని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజా పాలనకు పునరంకితం** 2024 ఎన్నికల్లో 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు ఎన్డీఏ కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికే ఈ సభను నిర్వహిస్తున్నామని, ప్రజాసేవకు తమ ప్రభుత్వం పునరంకితమవుతోందని ప్రకటించారు. ఈ రెండేళ్లలో ఏం చేశామో, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏం చేయలేకపోయామో కూడా ప్రజలకు చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని, తమ పాలనలో దాపరికం ఉండదని స్పష్టం చేశారు. కష్టకాలంలో విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్‌కు ఓటేసి రాష్ట్రాన్ని గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆక్సిజన్ ఇచ్చి బతికించిందని, ఈ రోజు ప్రజలు శాంతియుతంగా, తమ ఆస్తులకు రక్షణతో జీవించగలుగుతున్నారంటే అది ఎన్డీఏ పాలన వల్లే సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

**గత ఐదేళ్ల చీకటి పాలనపై నిప్పులు** గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనను 'చీకటి పాలన'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా విధ్వంసం చేశారని ఆరోపించారు. కేంద్ర పథకాలను పక్కనపెట్టి, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. పెట్టుబడిదారులను వేధించి రాష్ట్రం నుంచి తరిమేశారని, యువత భవిష్యత్తును దెబ్బతీశారని అన్నారు. కేంద్రం ఇంటింటికి కుళాయి కోసం రూ.27,000 కోట్లు ఇస్తే, దానిని కూడా వాడుకోలేని దుస్థితిలో గత ప్రభుత్వం ఉందని విమర్శించారు. తనతో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా అడుగడుగునా వేధించారని, ఎలాంటి నోటీసు లేకుండా తనను 53 రోజులు జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు, చివరికి మద్యాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన వాళ్లకు రాష్ట్రాన్ని గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు.

**సంక్షేమంలో మేం చెప్పింది చేశాం** ఎన్ని ఆర్థిక కష్టాలున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 'సూపర్ సిక్స్' హామీల అమలును ప్రస్తావించారు. ఎన్టీఆర్ భరోసా కింద పెన్షన్లను రూ.4,000కు పెంచి, 63 లక్షల మందికి అందిస్తున్నామని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమమని అన్నారు. 'తల్లికి వందనం' ద్వారా ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఏటా రూ.15,000 ఇస్తున్నామని, 'శ్రీశక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించగా, ఇప్పటివరకు 71 కోట్ల మంది ప్రయాణించారని వెల్లడించారు. 'దీపం' కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏటా రూ.20,000 అందిస్తున్నామని వివరించారు. వీటితో పాటు గీత కార్మికులు, వడ్డెర్లు, నాయి బ్రాహ్మణులు, పాస్టర్లు, ఇమామ్‌లు తదితర అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

**అభివృద్ధి, పెట్టుబడులతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తాం** గత ప్రభుత్వ హయాంలో పారిపోయిన పెట్టుబడిదారులకు మళ్లీ నమ్మకం కల్పించామని చంద్రబాబు అన్నారు. భూమి, నీళ్లు, అనుమతులు సకాలంలో ఇచ్చి, సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించడంతో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరిపాలనలో చెత్త, పరిసరాల్లో చెత్త, మనసుల్లో చెత్తను తీసివేసి 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్'ను నిర్మిస్తున్నామని అన్నారు. చెత్త పన్ను, నాలా చట్టం వంటి ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేశామన్నారు. దేశంలోనే తొలిసారిగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, ట్రూ-డౌన్ ఛార్జీల ద్వారా తగ్గించి ప్రజలపై రూ.466 కోట్ల భారాన్ని తగ్గించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనని గర్వంగా చెప్పారు.

**మోదీ నాయకత్వం దేశానికి శ్రీరామరక్ష** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఓటమి ఎరుగని నాయకుడిగా అభివర్ణించిన చంద్రబాబు, ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. మోదీ పాలనలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, వందే భారత్ రైళ్లు వంటి మౌలిక సదుపాయాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి ప్రయోగాలతో ప్రపంచంలో భారతదేశ ప్రతిష్టను ఇనుమడింపజేశారని ప్రశంసించారు. నిన్న జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో కూడా 'వికసిత్ భారత్' కోసం ప్రధాని స్పష్టమైన బ్లూప్రింట్ ఇచ్చారని, దేశంతో పాటు రాష్ట్రాన్ని కూడా ముందుకు నడిపిస్తామని అన్నారు.

**రాయలసీమ దశ మార్చే బృహత్ ప్రణాళికలు** రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు ఉద్ఘాటించారు. రాయలసీమను 'రాళ్ల సీమ' కాదు, 'రత్నాల సీమ'గా మార్చే బాధ్యత తనదని పునరుద్ఘాటించారు. ఇక్కడ స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ రాబోతున్నాయని, వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పుట్టపర్తిలో 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ తయారీ ప్రారంభమైందని, తిరుపతి జిల్లాకు బుల్లెట్ ఫ్యాక్టరీ కూడా వస్తుందని ప్రకటించారు. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రూ.లక్ష కోట్ల ప్రాజెక్టులతో ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మారుస్తామని భరోసా ఇచ్చారు. వంద రోజుల్లోనే హంద్రీనీవా నీటిని కుప్పంకు తీసుకువచ్చామని, ఈ ఏడాది కళ్యాణి డ్యామ్‌కు కూడా నీళ్లిచ్చి శ్రీశైలం మల్లన్నను, తిరుపతి వెంకన్నను కలుపుతామని స్పష్టం చేశారు.

**తిరుమల పవిత్రతను కాపాడతాం** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీసేందుకు గత ప్రభుత్వం కుట్ర చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. కల్తీ నెయ్యి వంటి సంఘటనలతో స్వామివారిని అపవిత్రం చేశారని, కలియుగ దైవానికి అపచారం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బ్రిటిష్ వాళ్లు కూడా భయపడిన వెంకన్న జోలికి వచ్చిన దుర్మార్గులకు ఈ జన్మలోనే శిక్ష తప్పదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తిరుమల పవిత్రతను కాపాడటానికి కట్టుబడి ఉందని, ఎవరైనా మళ్లీ అపవిత్రం చేయాలని చూస్తే సహించేది లేదని గట్టిగా హెచ్చరించారు.

**విజన్ 2047 లక్ష్యంగా ప్రయాణం** దేశం కోసం ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యంతో పనిచేస్తుంటే, రాష్ట్రంలో తాము 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. గొడ్డలి పార్టీ (వైసీపీ)కి ఎలాంటి విజన్ లేదని, వారిది పాయిజన్ మైండ్ అని విమర్శించారు. ఫేక్ న్యూస్‌తో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, కానీ తాము ప్రజలను, అభివృద్ధిని నమ్ముకున్నామని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలు అందరూ ప్రజలకు సేవకులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా, సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలతో, ప్రజలు మెచ్చే పాలన అందిస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు.

## రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు. అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

# నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి టీడీపీ కార్యాలయానికి చేసిన కేటాయింపు రద్దు చేయాలి

**వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న కలెక్టరేట్‌ను తక్షణమే తరలించాలి**

**అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**

**అఖిలపక్ష సమావేశానికి కూటమి పార్టీలు మరియు ప్రతిపక్ష పార్టీ డుమ్మా**

నంద్యాల సిటీ బ్యూరో జూన్ 12 ( నంది పత్రిక ) వ్యవసాయ రంగం మరియు ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రెండు కీలక అంశాలపై చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తెలుగు దేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం, అలాగే నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని ఇతర అనువైన ప్రాంతానికి తరలించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీలను మరియు వైఎస్సార్‌సీపీని మినహాయించి మిగిలిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మార్కెట్ యార్డులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో, నూనెపల్లె మార్కెట్ యార్డులోని సుమారు రూ.70 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని రైతుల ప్రయోజనాల కోసం వినియోగించకుండా రాజకీయ పార్టీకి కేటాయించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. కేవలం సంవత్సరానికి రూ.1,000 లీజుతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. అదేవిధంగా, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే తరలిస్తామని గతంలో హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. మరోవైపు పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం రైతు ప్రయోజనాలకు ఉపయోగపడే మార్కెట్ యార్డ్ భూమిని కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం వెంటనే నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగు దేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణం నుండి కలెక్టరేట్ కార్యాలయాన్ని తక్షణమే తరలించి పరిశోధన కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ అంశాలపై స్థానిక ప్రజాప్రతినిధి, మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ గారికి అఖిలపక్ష వేదిక తరపున వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. వినతిపత్రం సమర్పించిన 15 రోజులలోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, పార్టీ మరియు అనుబంధ రైతు సంఘాల నాయకులు రాజశేఖర్, సామన్న, రామచంద్ర, సుబ్బారెడ్డి, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకుడు చౌడప్ప, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మస్తాన్, చింతలయ్య, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్ శంకరయ్య, కొండన్న, సత్యనారాయణ గుప్తా, జానయ్య, రైతు సంఘాల నాయకులు బి.కె. మహేశ్వర్ రెడ్డి, నంది రైతు సమాఖ్య మరియు గడివేముల రైతు సంఘం నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ఏర్వ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, మనోజ్, ప్రచార కార్యదర్శి నిట్టూరి సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సేవలో అలుపెరుగని యోధుడు.. బుగ్గ రాముడు

నంద్యాల సిటీ బ్యూరో జూన్ 12 ( నంది పత్రిక ) నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ, 38 వార్డ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడు 38వ వార్డు వైఎస్సార్ నగర్ టిడిపి ఇంచార్జి తాటికొండ బుగ్గ రాముడు గారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా వారికీ పుట్టినరోజు శుభాకాంక్షలు .

**ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అంకితభావం:** స్థానిక 38 వార్డ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని పరిష్కరించడంలో బుగ్గ రాముడు గారు ప్రత్యేక చొరవ చూపుతారు. వార్డు అభివృద్ధిలో ఆయన చూపుతున్న చొరవ స్థానికులకు ఎంతో మేలు చేకూరుస్తోంది. వైఎస్సార్ నగర్ పరిధిలో ఏ చిన్న సమస్య తలెత్తినా, వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఆయన ప్రత్యేకత.



**పార్టీ పటిష్టతలో కీలక పాత్ర:**తెలుగుదేశం పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, కార్యకర్తలను సమన్వయం చేయడంలో బుగ్గ రాముడు గారు కీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ తనదైన శైలిలో ముందుండి నడిపిస్తూ, నాయకత్వానికి అండగా ఉంటున్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధిలా ఉంటూ, నాయకునిగా తనదైన ముద్ర వేసుకున్నారు.

**ఆయన పుట్టినరోజు వేడుకలు**

ఈ సందర్భంగా బుగ్గ రాముడు గారి నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలు సందడి చేస్తున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, మరిన్ని ఉన్నత పదవులను అధిష్ఠించి, ప్రజలకు ఇంకా పెద్ద ఎత్తున సేవలు అందించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఆయన చేపట్టిన ప్రజాసేవ కార్యక్రమాలు, సేవా దృక్పథం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఈ సందర్భంగా లితాటికొండ బుగ్గ రాముడు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు!

# పాడి పరిశ్రమతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి



**కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ. సిరి**

**'విలేజ్ హెర్డ్ ఫర్టిలిటీ రిజిస్టర్'**

**పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్**


నంది పత్రిక కర్నూలు బ్యూరో గ్రామీణ ప్రాంతాలలో పశు సంపదతోనే సుస్థిరాదాయం మరియు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని కర్నూలు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. సిరి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో నిర్వహించనున్న "పశువుల సమూహాము పునరుత్పత్తి పుస్తకం" (విలేజ్ హెర్డ్ ఫర్టిలిటీ రిజిస్టర్) ను ఆమె తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాడి ఉన్న ఇంట సిరుల పంట పండుతుందని, రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించి అధిక లాభాలు గడించాలని ఆకాంక్షించారు.

కలెక్టర్ సూచనలు & ముఖ్యాంశాలు:

క్రమబద్ధమైన ఈతలు: పాడి రైతులు తమ వద్ద ఉన్న ఆవులు సంవత్సరానికి ఒక ఈత, గేదెలు ప్రతి 15 నెలలకు ఒక ఈత ఈనేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉత్పాదకత పెంపు: పశువులకు సకాలంలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతల ద్వారానే అధిక పాల ఉత్పత్తి సాధించడం సాధ్యమవుతుంది. శాస్త్రీయ నిర్వహణ: కృత్రిమ గర్భధారణ, గర్భ నిర్ధారణ, సమతుల్య పోషకాహార నిర్వహణ మరియు దూడల సంరక్షణ వంటి చర్యలు పశువుల ఉత్పాదకతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సకాలంలో ఈనే పశువుల నుంచే గరిష్టంగా పాల దిగుబడి వస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సరికొత్త రిజిస్టర్ విధానాన్ని, సాంకేతికతను పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ నూతన సంయుక్త సంచాలకులు (జీశీఱత్ ణఱతీవష్శీతీ) డాక్టర్ కే. రాజశేఖర్ గారు పాల్గొని, జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తీసుకోబోయే చర్యలను వివరించారు.




# నిల్వ ఉంచి కుళ్లిన మాంసాహారం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

**హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్.**

**మటన్ మార్కెట్లో బయట పడ్డ నిల్వ ఉంచి దుర్వాసనతో కూడిన మాంసం.**

తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 12 నంది పత్రిక కుళ్ళిన, నిల్వ ఉంచిన మాంసాహారం, ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ వ్యాపారులను హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మేకలు, పొట్టేలకు సంబంధించిన కాళ్లు, తలకాయలు వంటివి నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని ప్రజల పిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం 28వ వార్డులోని పెద్ద పీర్ల చావడి లోని మటన్ మార్కెట్ ను పారిశుద్ధ్య సిబ్బంది తో కలసి హెల్త్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన మాంసం ఇక్కడ ఫ్రీజర్లలో నిల్వ ఉంచి పలు హోటళ్లకు, ప్రజలకు విక్రాయిస్తున్నారని పిర్యాదులు అందాయని తెలిపారు. కమిషనర్ శారదా దేవి ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం తమ సిబ్బందితో కలసి తనిఖీ లు నిర్వహించామని తెలిపారు. ఈ తనిఖీ ల్లో అర టన్ను మేర నిల్వ ఉంచిన తలకాయలు, కాళ్ళు వంటి ఇతర బాగాల మాంసం గుర్తించి సీజ్ చేశామని తెలిపారు. ముఖ్యంగా కుళ్ళి పోయిన దశలో దుర్వాసన వస్తున్న మాంసం గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ లో ఉంచి దుర్వాసన వస్తున్న మాంసాన్ని ఇనుప చువ్వలతో లాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పరిసరాలు కూడా అపరిశుభ్రతతో దారుణంగా ఉందని తెలిపారు. నగరపాలక సంస్థ చట్టం 1955 సెక్షన్ 483,484, 487,492,521, 541, 542, 543,544,545,546 మరియు 622లో అనుసరించి ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని తెలిపారు. కుళ్ళిన దశలో దుర్వాసన వెదజల్లుతున్న మాంసాన్ని సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన మాంసాన్ని క్రిమిసంహారక మందులతో పిచికారీ చేసి కంపోస్ట్ యార్డు కు తరలించామని తెలిపారు. నిల్వ ఉంచిన కుళ్ళిన మాంసం, ఆహార పదార్థాలు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీ ల్లో శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మేస్త్రిలు, స్వర్ణ వార్డు కార్యదర్సులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు**

**అన్ని విభాగాల అధిపతులతో కీలక సమీక్షా సమావేశం**

**మందులు, పరీక్షలు బయటకు రాస్తే కఠిన చర్యలు**



నంది పత్రిక కర్నూలు బ్యూరో ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆసుపత్రి ప్రాంగణంలో అన్ని విభాగాల అధిపతులతో (నూణం) ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న సేవలు, సాంకేతిక లోపాలు, సిబ్బంది పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు:

**కీలక నిర్ణయాలు – ఆదేశాలు:** మందులు బయటకు రాయొద్దు: రోగులకు అవసరమైన మందులను, వైద్య పరీక్షల శాంపిల్స్‌ను అనవసరంగా బయటకు రాయకూడదు. ఒకవేళ ఏదైనా అత్యవసర పరిస్థితిలో మందులు బయటికి రాయాల్సి వస్తే, ఆ విషయాన్ని తప్పనిసరిగా ముందే తన దృష్టికి తీసుకురావాలి.ఈ-హాస్పిటల్ రేటింగ్ పెంచాలి: 'నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్' వెబ్‌సైట్‌లో పలు విభాగాల పనితీరు శాతం తక్కువగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పీజీలు, ఇంటర్న్‌లకు దీనిపై ప్రత్యేక అవగాహన కల్పించి ఆన్‌లైన్ పనితీరు శాతాన్ని తక్షణమే మెరుగుపరచాలని సూచించారు.ఓపీ సమయాలు పాటించాలి: అన్ని విభాగాలు నిర్దేశిత ఓపీ (నూా) సమయాలను ఖచ్చితంగా పాటించాలి. సమయపాలన విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు.అవినీతిపై ఉక్కుపాదం: ఆసుపత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా రోగుల నుండి లేదా వారి బంధువుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.పరిశుభ్రతకు ప్రాధాన్యత: ఆసుపత్రిలో శానిటేషన్ బిన్స్ లేదా బయో మెడికల్ వేస్ట్ కవర్ల కొరత ఎక్కడైనా ఉంటే తక్షణమే సమాచారం అందించి, కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి సేవల నాణ్యతను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు గారితో పాటు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లు, వివిధ విభాగాల అధిపతులు, ముఖ్య వైద్యులు పాల్గొన్నారు.



# జనసేన సిద్ధాంతాల కోసం నిరంతర సేవలు అందిస్తున్న శీలంశెట్టి లక్ష్మయ్యకు 50వ జన్మదిన శుభాకాంక్షలు



పోరుమామిళ్ల, జూన్12: (నంది పత్రిక) వైఎస్సార్ కడప జిల్లా, బద్వేల్ నియోజకవర్గం, పోరుమామిళ్ల మండలం, పంచాయతీ 7వ వార్డుకు చెందిన శీలంశెట్టి లక్ష్మయ్య గారు 1977 జూన్ 12న జన్మించారు(జూన్ 9వ తేదీ శీలంశెట్టి నందిని బర్త్డే,జూన్ 12వ తేదీ శీలం శక్తి నరేష్ బర్త్డే,జూన్ 12 శీలంశెట్టి లక్ష్మయ్య బర్త్డే జూన్ 20వ తేదీ శీలంశెట్టి లక్ష్మయ్య, సతీమణి విజయలక్ష్మి యొక్క మ్యారేజ్ డే, )రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీతో ప్రారంభించిన ఆయన, అనంతరం జనసేన పార్టీ అధ్యక్షులు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చడంతో 2014లో జనసేన పార్టీలో చేరారు.చిన్నచిన్న పార్టీ కార్యక్రమాలతో ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం, 2021 స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ మరింత బలంతో, పౌరుషంతో విస్తరించింది. ఆయన సతీమణి కూడా జనసేన వీరమహిళగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ లక్ష్మయ్యకు ఎల్లప్పుడూ అండగా నిలిచారు. 2023 లో పోరుమామిళ్ల పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని స్థాపించిన లక్ష్మయ్య, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక పాదయాత్రలు నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ సామాన్యుల గొంతుకగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ అన్నదాన కార్యక్రమాలు, పేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాలు, యువతకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారు.2024లో పోరుమామిళ్లలో జనసేన పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన ఆయన, పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చారు. గ్రామ గ్రామాన పార్టీ సిద్ధాంతాలను చాటుతూ జనసేన జెండాను మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు.ప్రజాసేవే పరమావధిగా, పార్టీ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న శీలంశెట్టి లక్ష్మయ్య గారు మరెన్నో విజయాలు సాధించి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఆకాంక్షిస్తున్నారు.

# శిల్పా ర్యాలీకి తరలి వెళ్లిన కార్యకర్తలు

బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 12: చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు రెండేళ్ల కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి నిర్వహించిన ర్యాలీకి బండి ఆత్మకూరు మండలం నుండి కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈర్నపాడు రైతు సంఘం నాయకుడు పిట్టం పెద్ద రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండల రైతు విభాగం జనరల్ సెక్రటరీ సిద్ధ మౌలాలి రెడ్డి, ఎర్రం గోపాల్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు రాగల వెంకటరమణ, తో పాటు పార్నపల్లి, ఏ కోడూరు, సంత జుటూరు, నారాయణపురం, చిన్నదేవలాపురం, గ్రామాలలోని నాయకులతోపాటు కార్యకర్తలు కూడా ర్యాలీలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. గ్రామాలలో వైసీపీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనేందుకు గ్రామాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు.



## నంద్యాలలో... వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన.. భారీర్యాలీ...

# కదం తొక్కిన వైసీపీ శ్రేణులు!





### కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజం... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి
### డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం.. శిల్పా రవిరెడ్డి సవాల్
### రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు అండగా.. వైసీపీ
### రెండు తెల్ల గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న నిరసన.

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 12 ( నంది పత్రిక )** నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు....అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని.. అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్....నంద్యాల శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విధ్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు."విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతాలనికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.








## జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ కలెక్టర్లు..!



**కడప, బ్యూరో చీఫ్ జూన్ 12 నంది పత్రిక:** క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించిన అసిస్టెంట్ కాలెక్టర్ల బృందం.. అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా జిల్లా కలెక్టర్ వినూత్న అవిష్కరణతో అమలులోకి వచ్చిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దంపతులు వారితో కలిసి మధ్యాహ్న విందును చేసి.. చక్కటి ఆతిథ్యం అందించారు. శిక్షణలో భాగంగా.. పరిపాలన సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ నుండి పలు సూచనలు, సలహాలను స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్లు కడప జిల్లా చారిత్రక వైభవానికి ఫిదా అయ్యామని ఇక్కడి పర్యాటక వనరులు, ఇక్కడి ప్రజల స్వభావం, జీవనశైలి మమకారం మేళవించినట్లుందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్లకు చిరు కానుకను అందజేసి సత్కరించారు. కాగా చక్కటి ఆతిథ్యం అందించిన జిల్లా కలెక్టర్ దంపతులకు వారు ధన్యవాదాలు తెలియజేసారు.సాయంత్రం జిల్లాలోని చారిత్రక, పురాతన శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం.. జిల్లాలో పర్యటనను ముగించుకుని వెళ్లారు. క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వారిలో.. అసిస్టెంట్ కలెక్టర్లు.. సిహెచ్. శ్రవణ్ కుమార్ రెడ్డి, (ఏలూరు), హరిఓం పాండ్య (శ్రీకాకుళం), జిల్లా ఆదిత్య శర్మ (తూర్పుగోదావరి), నమ్రత్ అగర్వాల్ (కృష్ణా), పవన్ తేజ ఏఆర్ (ఎస్పీఎస్ నెల్లూరు), ప్రియా (కాకినాడ), సుయాస్ కుమార్ (అనంతపురం), వెంకటేష్ బన్న (చిత్తూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వారివెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుమామిళ్లలో జేసీ నిధి మీనా ప్రత్యక్ష వినతి స్వీకారం



**పోరుమామిళ్ల, జూన్ 12 (నంది పత్రిక )**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా, పారదర్శకంగా మరియు సమర్థవంతమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో చేపట్టిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఒక నియోజకవర్గం, ఒక నెల, నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల మండలంలో రెండవ పర్యటనను శుక్రవారం నిర్వహించారు.కడప జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఐఏఎస్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని శ్రీ పద్మావతి ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుండి నేరుగా వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా బద్వేల్ డివిజన్ ఆర్డీవో ఏ. చంద్రమోహన్, కడప జిల్లా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మొత్తం 301 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమానికి : శిరివెళ్ల నుంచి భారీగా తరలిన వైఎస్సార్సీపీ శ్రేణులు



**సిరివెళ్ల (నంది పత్రిక)**వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపుతో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిర్వహించనున్న "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి .శిరివెళ్ల మండలం నుంచి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు. నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ పార్టీ ఉపాధ్యక్షుడు బసాపురం సలాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. శిరివెళ్ల మండల వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఊపి నాయకులు, కార్యకర్తలను ఆళ్లగడ్డకు సాగనంపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై నినాదాలు చేస్తూ ఆళ్లగడ్డకు బయలుదేరడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి

### బూత్ ఏజెంట్లకు కర్నూలు ఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి
### ఈ నెల 15 నుంచి ఇంటింటికీ బీఎల్వోలు.. అర్హులైన ఏ ఒక్క ఓటూ తొలగించబడదు
### ఓటరు వివరాలు, పత్రాలను ఇప్పుడే సిద్ధం చేసుకోవాలి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో** భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్)ను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ప్రజలు సమిష్టిగా సహకరించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో), నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. శుక్రవారం స్థానిక బాలాజీ నగర్లోని కర్నూలు కన్వెన్షన్ హాల్లో కర్నూలు నియోజకవర్గానికి చెందిన బీఎల్ఏలకు ఎస్ఐఆర్పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ లక్ష్యాలు, విధివిధానాలు, బీఎల్ఏల పాత్రపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేనిదిగా రూపొందించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, నకిలీ లేదా ద్వంద్వ నమోదులను గుర్తించి తొలగిస్తామన్నారు. ఈ ప్రక్రియలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటును కూడా తొలగించబోమని ఆయన స్పష్టం చేశారు.

**సమావేశంలోని ముఖ్య ముఖ్యాంశాలు:** 15 నుంచి ఇంటింటికీ బీఎల్వోలు: ఈ నెల 15వ తేదీ నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి ఓటరికి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారు. వాటిని ఓటర్లు స్వయంగా పూర్తి చేసి ఇవ్వాలి. అందులో ఒక ఫారంపై బీఎల్వో సంతకం చేసి రసీదు రూపంలో ఓటరుకు తిరిగి ఇస్తారు. సిద్ధంగా ఉంచుకోవాల్సిన పత్రాలు: ప్రజలు తమ ఈపిక్ (ఓటరు గుర్తింపు కార్డు), రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, కుటుంబ సభ్యుల ఓటరు వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలి. 2002 నాటి ఓటరు జాబితా వివరాలు, పోలింగ్ కేంద్రం నంబర్, పార్ట్ నంబర్, వరుస సంఖ్య, కుటుంబ పెద్దల ఈపిక్ వివరాలు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ సులువవుతుంది. మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి: వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. బీఎల్ఏల పాత్ర కీలకం: ఎస్ఐఆర్పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉంది. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అనంతరం ప్రతి ఒక్కరూ తమ వివరాలు సరిచూసుకునేలా ప్రోత్సహించాలి. చేర్పులు, సవరణలు, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిశీలించి సమర్పించాలి.

ప్రజాస్వామ్యానికి మూలాధారమైన ఓటరు జాబితా తయారీలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికల సంఘానికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.



## ప్రపంచంలో అత్యంత సురక్షితమైన దేశాలు ఇవే.. జాబితాలో మనం ఎక్కడున్నామో తెలుసా?

ప్రపంచ శాంతి సూచీ (గ్లోబల్ పీస్ ఇండెక్స్) 2026లో భారత్ ర్యాంకు గణనీయంగా క్షీణించింది. మొత్తం 163 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో భారత్ 127వ స్థానానికి పరిమితమైంది. ఇన్స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (×జూ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఐస్లాండ్ వరుసగా 18వ సంవత్సరం కూడా ప్రపంచంలోనే అత్యంత శాంతియుత దేశంగా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. నివేదిక ప్రకారం, ప్రపంచంలోని సురక్షితమైన దేశాల జాబితాలో గతేడాది 115వ ర్యాంకులో ఉన్న భారత్, ఈసారి 12 స్థానాలు దిగజారి 127వ స్థానానికి పడిపోయింది. దేశంలో కొనసాగుతున్న అంతర్గత ఘర్షణలు, పొరుగు దేశాలతో నెలకొన్న ఉద్రిక్త సంబంధాలు, మణిపూర్లో జాతి హింస వంటి అంశాలు భారత్ ర్యాంకు క్షీణించడానికి ప్రధాన కారణాలని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 'కొనసాగుతున్న సంఘర్షణల' విభాగంలో భారత్ స్కోరు 9.2 శాతం మేర తగ్గడం గమనార్హం.

# డోన్‌లో 'వెన్నుపోటుకు రెండేళ్లు'..

## కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి బుగ్గన ధ్వజం






**నందిపత్రిక –డోన్** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డోన్ పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

**హామీల పేరుతో నట్టేట ముంచారు.** ఈ సందర్భంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇంటింటికి తిరిగి అక్క, వదిన, బావ అని వరసలు కలిపి, 'సూపర్ సిక్స్' పథకాలంటూ నమ్మించి ప్రజలను నట్టేట ముంచారని మండిపడ్డారు. కూటమి నాయకులు ఇప్పుడు బయటకు వస్తే ప్రజలు పళ్ళు రాలగొట్టే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. రెండేళ్లు గడిచినప్పటికీ కొత్త పెన్షన్లు ఇవ్వడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అబద్ధాలు చెప్పలేకపోయారని, కానీ ప్రజలు చంద్రబాబు చెప్పిన అబద్ధాలను నమ్మి మోసపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**అభివృద్ధి పనులకు కూటమి బ్రేకులు** డోన్ పట్టణంలో దశాబ్దాలుగా రైల్వే గేట్ల వల్ల ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులను గమనించి, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే అధికారులతో చర్చలు జరిపి, ఎంతో కృషి చేసి రైల్వే అండర్ పాస్ పనులను శాంక్షన్ చేయించామని బుగ్గన గుర్తుచేశారు. తాము పనులకు శంకుస్థాపన కూడా చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్లను పనులు చేయనివ్వకుండా, తమకు సంబంధించిన వారితో కోర్టుల్లో కేసులు వేయించి ప్రజల ఇబ్బందులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చివరికి దేవాలయాల అభివృద్ధి పనులను కూడా నిలిపివేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.రైతులను,పిల్లలను, ఆడవాళ్లను, వృద్ధులను.. అందరికీ పథకాలు ఇస్తామని నమ్మించి మోసం చేసినందుకా ఇది మంచి ప్రభుత్వం? ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరవకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

**రాబోయేది జగనన్న ప్రభుత్వమే** రాబోయే కాలంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని, జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లుగా అది '2.0 కార్యకర్తల ప్రభుత్వం' అవుతుందని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, సప్త శైల రాజేష్ , రాజశేఖర్,అక్బర్ బాషా, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బోరా మల్లి, నిజాముద్దీన్, మస్తాన్ ఖాన్, కొండయ్య, బోరెడ్డి రఘు, రాము, రజని,జింకల అంజి, పెద్దిరాజు, రామ్మూర్తి నాగరాజు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ కాదు దగ డిఎస్సి




## ఆదోని మాజీ వైసీపీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఈరోజు వైఎస్ఆర్సిపి నియోజవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గారి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం నుంచి శ్రీనివాస్ భవన్ అంబేద్కర్ విగ్రహం నుంచి నిరసన ర్యాలీ కార్యక్రమం చేయడం జరిగింది అనంతరం వైఎస్ఆర్సిపి ఆదోని నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గారు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో కుటుంబ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో సంక్షేమ పథకం కూడా సరిగ్గా ఈ రాష్ట్ర ప్రజలకు అందించలేక అన్ని రకాలుగా విఫలమైందని రైతుల్ని కార్మికులను మహిళలను విద్యార్థుల్ని అన్ని వర్గాలని వంచించిన ఏకైక కూటమి ప్రభుత్వం రైతు లకు భరోసా పంట ఇన్సూరెన్స్ లేదు మహిళలకు ఎంతమంది ఉంటే అంతమందికి 1500 లేదు రాష్ట్ర ప్రజల కు అబద్ధాలు చెప్పి అధికారం సంపాదించుకున్న తర్వాత ఈ రాష్ట్ర ప్రజల కు అభివృద్ధి చేయాల్సిన నిధులన్నీ కూడా అమరావతిలో స్క్వేర్ ఫీట్ 20000 ప్రకారం అమరావతిలో బిల్డింగులకు రియల్ ఎస్టేట్ వాళ్లకు దోచి పెడుతూ రాష్ట్ర ప్రజల మీద అప్పులు మోపి గెట్టిగా అడిగిన వాళ్ల మీద కేసులు పెడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో తోస్తూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ ముందుకెళ్తున్నటువంటి ఈ కూటమి ప్రభుత్వం మీద ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని ప్రజలందరూ కూడా స్థానిక ఎన్నికల కోసం ఎదురు చూస్తా ఉన్నారు ఈ కూటమి ప్రభుత్వాన్ని పతనం చూడాలని చంద్రబాబు లాంటి మోసకారి ఈ ప్రపంచంలోనే లేరని పిల్లనిచ్చినటువంటి నందమూరి తారక రామారావు గారిని వెన్నుపోటు పొడిచి ఆ పార్టీని లాక్ కున్నటువంటి చంద్రబాబుకు ప్రజలకు వెన్నుపోటు పడడం అలవాటేనని చంద్రబాబు నాయుడు గారి ఊసరవెల్లి ఏ రాష్ట్రంలో ఉండరని గడిచిన రెండు సంవత్సరాలైనా కనువిప్పు కలుగుతుందేమో అని చూసినం చంద్రబాబు తీరు మారదని ప్రజలందరూ కూడా గమనిస్తా ఉన్నారు ప్రజల కష్టాలను ఆసరాగా చేసుకుని వారికి సూపర్ సిక్స్ అనే పథకాలు ఆశ చూపించి నట్టేట ముంచిన చంద్రబాబు కు ఇక మూడేళ్లే గడువు ఇకనుంచైనా మారు చంద్రబాబు 2029లో జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అవుతారు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది ఈ రాక్షస ప్రభుత్వాన్ని అంతం అందించే వరకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికులు వలె కష్టపడాలని సాయి ప్రసాద్ రెడ్డి గారు కార్యకర్తలకు పిలుపునివ్వడం జరిగింది కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ ఎండగా ఉంటుంది నేను అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇవ్వడం జరిగింది స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని కచ్చితంగా మున్సిపాలిటీ మనం కైవసం చేసుకోవాలని రానున్న రోజులో జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చూడాలని అంతవరకు అలుపెరుగని పోరాటం కలిసికట్టుగా చేద్దామని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి పట్టణ అధ్యక్షులు బి దేవా మండల అధ్యక్షులు గుర్నాథ్ రెడ్డి యూత్ అధ్యక్షులు నల్లారెడ్డి సన్నీ మూర్తి మురళి రెడ్డి రామలింగేశ్వర యాదవ్ మల్లెల తాయన్న ఏసోబు అశోక్ మల్లీ ఆర్ వి బాబు ముకప్ప రాయుడు గాదులింగ వీరప్ప భరత్ జాలమంచి శాంతా రామకృష్ణ దానం వేణు బి కే కే లక్ష్మణ అందుబాయి రహీం తాహిర్ ఫయాజ్ వీరాంజి చిన్న గుంటప్ప ఎరుకల రమేష్ ఎరుకల ఈరన్న బాలాజీ భాస్కర్ రాజేశ్వర్ రెడ్డి మల్కీ మధు మనీ గణేష్ రవి అల్తాఫ్ శ్రీ లక్ష్మీ మంజుల లక్ష్మీ మండగిరి శేశిరెడ్డి గౌసియా అన్నపూర్ణ లక్ష్మి కిషోర్ ఉచ్చిరప్ప నగరూర్ చంద్రశేఖర్ రెడ్డి కోటిరెడ్డి తిమ్మారెడ్డి వెంకటేశ్వర రెడ్డి రఘునాథ్ రెడ్డి జీవన్ తబ్రేష్ నాగరాజ్ హనుమేష్ నాగరాజ్ శంకర్ భవాని ఇర్ఫాన్ భాషా చంటి కిరణ్ చిన్న రంగస్వామి విశ్వనాథ్ దుర్గప్ప సాంబ పాండవగల్ గిడ్డయ్యఖ బసవ పొన్నూరు శ్రీనివాసులు గాది లింగ నాగరాజ్ గంగాధర్ నారీ బీమా చిన్న వీరప్ప చిన్న గుంటి స్టోర్ గోపాల్ గోపాల్ రామంజి వెంకటేష్ జయరాం సోమనాథ్ ఎరుకల వెంకటేష్ హైదరాబాద్ వెంకటేష్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

# బాల అకాడమీ విజయ గాథ

## రీకౌంటింగ్ లో పెరిగిన మార్కులు




**నంద్యాల ప్రతినిధి. జూన్ 12 . (నంది పత్రిక ):**పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో బాల అకాడమీకి చెందిన విద్యార్థులు రీకౌంటింగ్ అనంతరం మరింత మెరుగైన మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. సుమైరా అను విద్యార్థిని గతంలో 587 మార్కులు పొందగా, రీకౌంటింగ్ అనంతరం 591 మార్కులతో బాల అకాడమీలో ప్రథమ స్థానంలో నిలిచింది. అఫ్ష అంజుమ్ అనే విద్యార్థిని కూడా గతంలో 582 మార్కులు పొందగా రీకౌంటింగ్ అనంతరం 589 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.దీంతో వారి మొత్తం మార్కులు పెరిగి మరింత మెరుగైన ఫలితాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాల అకాడమీ ప్రిన్సిపల్ మాధవి లత మాట్లాడుతూ'విద్యార్థుల కృషి ఎప్పటికి వృధా కాదు. రీకౌంటింగ్ ద్వారా వారికి రావలసిన మార్కులు రావడం ఆనందదాయకం ఇది వారి శ్రమకు దక్కిన న్యాయం' అని పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. బాల అకాడమీ విద్యార్థులు ప్రతిభతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# డోన్‌లో వైఎస్సార్ సీపీ బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సు

### ఎన్నికల ప్రక్రియ,ఎస్ ఐ ఆర్ అంశాలపై సమగ్ర శిక్షణ

### ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



**నందిపత్రిక –డోన్** డోన్ నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సు స్థానిక 'ఎం కన్వెన్షన్ హాల్' నందు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మాజీ ఆర్థిక శాఖ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య సమక్షంలో, ఆయన దిశా నిర్దేశంలో ఈ సదస్సును నిర్వహించారు. రాబోయే రాజకీయ, ఎన్నికల వ్యూహాల్లో భాగంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. **ఎన్నికల ప్రక్రియపై ప్రత్యేక అవగాహన:**ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బూత్ లెవల్ ఏజెంట్లకు ఎన్నికల నియమావళి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ౫×= అంశాలపై ఏజెంట్లకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ, క్షేత్రస్థాయిలో వారు ఎలా వ్యవహరించాలనే దానిపై సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు నమోదు, మార్పులు–చేర్పులపై బూత్ స్థాయి నుంచే గట్టి నిఘా ఉంచాలని ఆయన పిలుపునిచ్చారు."పార్టీ విజయానికి బూత్ లెవల్ ఏజెంట్లే వెన్నెముక లాంటివారు. క్షేత్రస్థాయిలో ప్రతి నియోజకవర్గ కార్యకర్త అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి డోన్ నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు నియోజకవర్గ, మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరూ ఎంతో శ్రద్ధగా శిక్షణా అంశాలను నోట్ చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఈ అవగాహన సదస్సు అత్యంత విజయవంతమైందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# సర్పాల సయ్యాట

**కొత్తపల్లి – నంది పత్రిక :** తొలకరి వర్షాలు మొదలు అయ్యాయి. దీంతో వాతావరణం కాస్తా చల్లపడింది. అయితే ఎక్కడో పొదల మాటున ఉండాల్సిన సర్పాలు బయటివస్తున్నాయి. ఎక్కువగా పొలాల మధ్యలో సర్పాలు ఈ కాలంలో ఎక్కువగా పెనవేసుకొని కనపడడం సహజం. శుక్రవారం గువ్వలకుంట్ల గ్రామంలోని ఓ ఇంటి వెనుక భాగంలో రెండు భారీ సర్పాటు పెనవేసుకొని సయ్యాటలాడడం అక్కడున్న ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి. మధ్యాహ్నం 1 గంట సమయం నుంచి 4 గంటలవరకు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశాయి. కాకపోతే ఇలాంటి సర్పాలవల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సి అవసరం ఎంతైనా ఉంది.



# కర్నూలును పలకరించిన వరుణుడు: భానుడి భగభగల నుంచి ఉపశమనం!

### ఎండల తీవ్రతతో అల్లాడిన జనానికి దక్కిన చల్లని ఊరట

### గత కొన్ని రోజులుగా కురుస్తున్న అమృత వర్షాలు..

### పులకించిన సీమ గడ్డ

**నంది పత్రిక కర్నూల్ బ్యూరో** కర్నూలు జిల్లాను వరుణ దేవుడు కరుణించాడు. గత కొన్ని నెలలుగా ఎండల తీవ్రతతో, ఉక్కపోతతో నరకయాతన అనుభవించిన కర్నూలు నగర ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించింది. రోహిణి కార్తె ముగిసి, మృగశిర ప్రవేశంతో జిల్లా వ్యాప్తంగా వర్షాకాలం ఆశాజనకంగా ప్రారంభమైంది. గత కొన్ని రోజులుగా క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తీవ్రమైన ఎండాకాలం తర్వాత కురుస్తున్న ఈ వర్షాలు నగర ప్రజల గుండెల్లో అమృతధారల్లా మారాయి.

**ఎండల ఇబ్బందులు పగటికలగా..**ఈ ఏడాది వేసవి కాలంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైన సంగతి తెలిసిందే. భానుడి భగభగలకు జనం ఇళ్లనుంచి బయటకు రావడానికే భయపడ్డారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించాయి. తాగడానికి గుక్కెడు నీరు దొరకక, విద్యుత్ కోతలతో, ఉక్కపోతతో సామాన్యులు, వ్యాపారులు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లు ఎండిపోవడంతో నీటి కోసం మహిళలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

**కొన్ని రోజులుగా కురుస్తున్న మేఘామృతం..**

అలాంటి కఠినమైన పరిస్థితుల తర్వాత, గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు జనంలో కొత్త ఆశలు రేకెత్తించాయి. వరుసగా కురుస్తున్న ముసురు, గాలివానలతో నగర వాతావరణం కాశ్మీరాన్ని తలపిస్తోంది. ఎండల ధాటికి వేడెక్కిన నేల తల్లి.. వరుస వర్షాలతో చల్లబడింది. గత ఐదారు రోజులుగా పడుతున్న వర్షాలు కేవలం వచ్చిపోయే జల్లుల్లా కాకుండా, భూమి తడిచేలా పడుతుండటంతో నగర ప్రజలు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. "నెల రోజులుగా ఉక్కపోతతో రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు. ఇప్పుడు వాతావరణం చాలా ప్రశాంతంగా, చల్లగా మారింది. ఈ వర్షాలు నిజంగా దేవుడు ఇచ్చిన వర ప్రసాదం."

నగర వాసి ఆనందం

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం** నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని రైతాంగం సైతం ఈ తొలి వర్షాలకు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నుకోవడానికి, విత్తనాలు వేసుకోవడానికి ఈ తరుణం ఎంతో అనుకూలంగా ఉండటంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. మొత్తానికి, భానుడి బారి నుంచి కర్నూలు విముక్తి పొందింది. ముసురు పట్టిన ఆకాశం, చల్లని గాలులు, నిరంతరం కురుస్తున్న వర్షాలు నగరానికి సరికొత్త రూపాన్ని ఇచ్చాయి. రాబోయే రోజుల్లో కూడా వర్షాలు ఇలాగే సమృద్ధిగా కురిసి, తాగునీటి, సాగునీటి కష్టాలు పూర్తిగా తీరాలని కర్నూలు ప్రజలు కోరుకుంటున్నారు.



# యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి





## జూన్ 21న లక్ష మందితో జిల్లా వ్యాప్తంగా భారీ యోగా కార్యక్రమం

## యోగాంధ్ర-2026 విజయవంతానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపు

**నంద్యాల/మహానంది జూన్ 12 (నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహానంది దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. నిత్యం 30 నుంచి 45 నిమిషాల పాటు యోగాభ్యాసం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవడుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో సమతుల్యత సాధించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన వంటి విలువలను కూడా పెంపొందిస్తుందని వివరించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంతో జూన్ 7న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు జూన్ 21 వరకు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యోగాపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్ ద్వారా నమోదు చేసుకొని అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సిద్ధం కావాలని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటికే శ్రీశైలం దేవస్థానం, మహానంది దేవస్థానాల్లో యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 17న జిల్లాకు కేటాయించిన ప్రత్యేక థీమ్ ఆధారంగా యోగాంధ్ర అసోసియేషన్ సభ్యులందరితో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సుమారు ఒక లక్ష మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా యోగా ప్రదర్శన ఇచ్చిన మహిళా బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

యోగా శిక్షణ అందించిన రమ్యతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న ఐదుగురు సభ్యులు మహిళలే కావడం విశేషమని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచిన వందితను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఉదయం నుంచే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహబూబ్ దౌలా ఆర్డీవో విశ్వనాథ్, మహానంది దేవస్థానం ఈఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యంత్రాంగం, ఆయుష్ మరియు వైద్య బృందాలకు, అలాగే కార్యక్రమ విజయవంతానికి నాయకత్వం వహించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌కు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహానంది క్షేత్రంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగాపై మరింత ఆసక్తిని కలిగించిందన్నారు.






# విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది కలెక్టర్ రాజకుమారి





## తిమ్మాపురం జడ్పీహెచ్ స్కూల్ను పరిశీలించిన కలెక్టర్

**నంద్యాల / మహానంది, జూన్ 12 (నంది పత్రిక):-** విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను కలెక్టర్ సందర్శించారు. కొత్త విద్యా సంవత్సరానికి హాజరైన విద్యార్థులకు పుష్పాలు అందజేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా వాతావరణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కిచెన్ షెడ్‌ను సందర్శించి పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. తాగునీటి వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఆర్.ఓ. ప్లాంట్‌ను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పారిశుధ్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ విశాలంగా ఉండటంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటి హరిత వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ విద్యపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఆరవ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు గులాబీ పువ్వులు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బెల్ట్‌లు, షూస్ తదితర విద్యా సామగ్రి విద్యార్థులకు అందజేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రెడ్డి, విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య, హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**మహానంది, జూన్ 12 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం లోని ఏపీ మోడల్ స్కూల్లో 2026-27 విద్యా సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 6, 7, 8, 9వ తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6.ఎస్టీ బాలికలు -2, 7. ఓసి జనరల్ -1,8. ఓసి జనరల్ -2, ఎస్సీ జనరల్-1, బి సి ఏ జనరల్ -1,9.ఓసి జనరల్ -1, ఎస్సీ జనరల్-1 ఖాళీలు ఉన్నాయన్నారు.దరఖాస్తుల స్వీకరణ తేదీ ఈ నెల 20 వరకు కొనసాగుతుందన్నారు.24న ప్రవేశ పరీక్ష, 25న ఎంపికైన విద్యార్థుల జాబితా, 26న సర్టిఫికెట్ల పరిశీలన ప్రవేశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి కలెక్టర్ రాజకుమారి



**మహానంది, జూన్ 12 (నంది పత్రిక):-** రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 (ఏపీ ఏఐఎంఎస్ ) ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి ఆధార్ కార్డుతో డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. డీలర్ లాగిన్ అయిన అనంతరం రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగా, రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, అవసరమైన ఎరువుల వివరాలు స్క్రీన్‌పై ప్రదర్శితమవుతాయని వివరించారు.ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువుల కోసం డీలర్ల వద్దకు వెళ్లే ముందు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ఇంచార్జ్‌ను సంప్రదించి, ఈ-క్రాప్‌లో నమోదైన పంట వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ పంట మార్పిడి జరిగి ఉంటే, సంబంధిత వివరాలను సవరించి నమోదు చేయించుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఇతర మండలాలు లేదా ఇతర ప్రాంతాల్లోని డీలర్ల వద్ద ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగానే ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ద్వారా సంబంధిత డీలర్ల పేర్లను తమ ఖాతాలో జోడించుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.రైతులకు ఎరువుల కొరత లేకుండా తగిన నిల్వలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు, డీలర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఏఈఓ వెంకటేశ్వర్లు,సిబ్బంది



# మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం



**మహానంది, జూన్ 12 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన నందీశ్వరునికి వేద పండితులు ప్రదోషకాలంలో విశేష అభిషేకాలు,అర్చనలు పూజలను వేదోక్తంగా చేశారు. శుక్రవారం అధిక జ్యేష్ఠ మాస బహుళ త్రయోదశి నంది ప్రదోషం సందర్భంగా దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో విశేషాభిషేకాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, ద్రవ్య పూజ పీఠార్చన,గంధం, పలురకాల చూర్ణాలతో అభిషేకించారు.అమెరికా, హైదరాబాద్,అనంతపురం, గుంటూరు, నంద్యాల వాసులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



# ఊరికి ఉపకారి





## గ్రామానికి బోరును దానం చేసిన అన్నదాత

**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 12:** సొంత గ్రామానికి, సమాజానికి ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఊరి బాగు కోసం తన పొలంలో ఉన్న సొంత బోరునే గ్రామానికి ధారాదత్తం చేసి ఊరికి ఉపగారిగా పేరు గడిస్తున్నాడు ఓ అన్నదాత. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.... బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న రామాపురం గ్రామంలో దశాబ్దాల కాలం నుండి బోరుబావి నీళ్లనే ఆ గ్రామస్తులు తాగునీటిగా వినియోగిస్తున్నారు,

శుభకార్యాలకు కూడా ఈ నీటిని వాడుకుంటూ ఉన్నారు. గ్రామంలో ఎప్పుడో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ గా నియమితులైన తాసిల్దార్ పద్మావతమ్మ తాగునీటి విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో త్రాగునీటి ని ప్రజలకు అందించాలని ఉద్దేశంతో గ్రామస్తులతో గ్రామ పెద్దలతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ తరుణంలోనే గ్రామానికి చెందిన బోయ ఎల్లయ్య అనే రైతు తన పొలంలో ఉన్న బోరును గ్రామంలో తాగునీటికి వాడుకునేందుకు గ్రామానికి ఇస్తానని అధికారులతో చెప్పి వెంటనే, బోరుతోపాటు సెంటు పొలాన్ని కూడా అధికారులకు ధారాదత్తం చేశారు. రైతు పొలం నుండి ప్రత్యేకంగా గ్రామం వరకు ఉన్న పైపులైన్లకు పైపులను అనుసంధానం చేశారు. పైపు లైను నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రత్యేకంగా బోరు వద్ద మోటారు ఏర్పాటు చేశారు. శుక్రవారం తాసిల్దారు పద్మావతమ్మ బోరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోరును దానం చేసిన రైతు బోయ ఎల్లయ్యను ఆ ప్రాంతానికి తీసుకొని వెళ్లి అతని సమక్షంలో పూజలు చేశారు. సొంత లాభం మానుకొని పొరుగు వారికి సాటి పడఓయ్ అన్న మాటకు అర్థం చెబుతూ, బోయ ఎల్లయ్య అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బోరును గ్రామానికి దానం చేసిన బోయ ఎల్లయను తాసిల్దార్ పద్మావతమ్మ ప్రత్యే కంగా అభినందించారు. నీటి విషయంలో ప్రత్యేకంగా చొరవ చూపిన తాసిల్దార్ పద్మావతమ్మను గ్రామస్తులు అభినందించారు. స్పెషలా ఫీసర్ గా తాను బాధ్య తలు తీసుకొన్న స్వల్ప కాలంలోనే గ్రామంలో నీటి సమస్య పరిష్కారం కావడం తనకు సంతోషాన్ని కలిగిం చిందని తాసిల్దార్ పద్మావతమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

# సహజ ఎరువుల వినియోగం ఎంతో అవసరం



**మహానంది, జూన్ 12 (నంది పత్రిక):-** వ్యవసాయాభివృద్ధికి సహజ ఎరువుల వినియోగం ఎంతో అవసరమని వ్యవసాయ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం మహానంది వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అధికంగా రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, నేల సారవంతతను కాపాడేందుకు జీవన ఎరువుల వినియోగాన్ని రైతులు పెంచాలన్నారు.సహజ ఎరువుల వినియోగం వల్ల వ్యవసాయ వ్యయాలు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు.సేంద్రియ, పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్,జీవ ఎరువులను సమన్వయంగా ఉపయోగించడం ద్వారా నేలలో సేంద్రీయ కార్బన్ శాతం పెరిగి, పంటల దిగుబడులు, నాణ్యత మెరుగుపడతాయని తెలిపారు. రైతులు నేల పరీక్షల ఆధారంగా ఎరువుల నిర్వహణ చేపట్టి, జీవ ఎరువులను సరైన పద్ధతిలో వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మూడే అర్జున్ నాయక్, డాక్టర్ ఎం. విష్ణు ప్రియ, వీఏఏ భారతి, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికిన ప్రభుత్వ ఉపాధ్యాయులు.

### వేసవి సెలవుల అనంతరం ఉత్సాహంగా పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు



**బేతంచర్ల జూన్ 12 (నందిపత్రిక ).** బేతంచెర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం శుక్రవారం నుంచి తిరిగి పునఃప్రారంభమయ్యాయి. దీర్ఘకాలం సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు, చిరునవ్వులతో ఘనంగా స్వాగతించారు.పట్టణంలోని ప్రభుత్వ మెయిన్ స్కూల్‌లో హెచ్‌ఎం. పాపారాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు దానమయ్య, రమణతో పాటు సిబ్బంది అందరూ పాల్గొని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూలగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించి,పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కొత్త దుస్తులు, పుస్తకాలు, బ్యాగులతో సిద్ధం చేసి ఉత్సాహంగా పాఠశాలకు తీసుకువచ్చారు. విద్యార్థుల ముఖాల్లో కనిపించిన ఆనందం, ఉత్సాహం పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంగా మార్చాయి.పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరం గురించి దిశానిర్దేశం చేసి, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా తమ తరగతి గదుల్లోకి వెళ్లి పాఠాలు ప్రారంభించారు. సెలవుల తర్వాత మళ్లీ స్నేహితులను, ఉపాధ్యాయులను కలవడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడా ఈ సంవత్సరం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# నంద్యాలలో ఏ 1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్





### జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 12 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని చాంద్ బాడ నందలి బదర్ మసీదు సమీపంలో న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మైనార్టీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, సౌత్ ఇండియా హజ్, ఉమ్రా అసోసియేషన్ చైర్మన్ సుల్తాన్, అధ్యక్షులు ఫయాజ్, కోశాధికారి అబ్దుల్ సలాం, జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ఇమాముల మరియు ఉలేమాల సంఘం అధ్యక్షులు అబ్దుల్ హాది సయీది, మౌలానా ఇద్రిస్, మౌలానా హుసేన్, హాఫిజ్ షరీఫ్, ముఫ్తి ఖలీల్ హుసేన్, షేక్ టైలర్ మౌలాలి, మౌలానా మహబూబ్ పీరా, టిడిపి వార్డు ఇంచార్జ్ కట్టెల ఆఫజల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం అధినేత మౌలానా ఇలియాస్ హనఫీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే మక్కా యాత్రను నిర్వహించడం, అందులో అనుభవజ్ఞులైన మౌలానాలచే ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు. ఏ1 ఇన్ఫోటెక్ ఇంటర్నేషనల్ టూరిజం అధినేత మౌలానా ఇలియాస్ హనఫీ మాట్లాడుతూ మక్కా యాత్రను పారదర్శకంగా నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ మా ట్రావెల్స్ తరపున ఉమ్రా యాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం** జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ కార్యాలయాన్ని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మనియార్ ఖలీల్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, మౌలానాలు, హాఫిజ్ లు పాల్గొన్నారు.





# "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### ప్రజలకు చేరువైన ప్రభుత్వ విజయాలను విస్తృతంగా చాటాలి

### జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

**నంద్యాల బ్యూరో, జూన్ 12(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టేక్కే మార్కెట్ యార్డులో ఈ నెల 17వ తేదీన జరగనున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంట నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమీషనర్ శేషన్న, సిపిఓ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదే విధంగా సభా ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, వైద్య శిబిరాలు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# చంద్రబాబు వెన్నుపోటు పాలన పై వైసిపి నిరసన ర్యాలీ



**ర్యాలీకి అనూహ్యస్పందన భారీగా హాజరైన వైసిపి కార్యకర్తలు నాయకులు**

**ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్త కాదు**

**ఎన్నికల ముందు ప్రజలు నమ్మే విధంగా హామీలు ఇవ్వడం అధికారం చేపట్టాక వాటిని ఎగరగొట్టడం ఇది చంద్రబాబు నైజం...మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**

**బనగానపల్లె జూన్ 12 నంది పత్రిక** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టాక ఎగర కొట్టడం చంద్రబాబు కొత్త కాదని ఇది చంద్రబాబు నైజం అని బనగానపల్లె మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి కూటమిపాలనపై నిప్పులు చెరిగారు శుక్రవారం బనగానపల్లెలో వైసీపీ రెండేళ్ల పాలనపై బనగానపల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వైఎస్ఆర్సిపి శ్రేణుల నుండి భారీ ఎత్తున స్పందన లభించింది. వైసీపీ మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో బనగానపల్లె రహదారుల లో జన సందోహం కనిపించింది. ర్యాలీ కాటసాని రామిరెడ్డి స్వగృహం నుండి మొదలై మండల తాసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఏళ్ల పాలనపై నిప్పులు చెరిగారు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెన్నుపోటు పొడిచి రెండేళ్ల అయిందని ప్రజలంతా ఇది గమనించాలని ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అంటూ ఎన్నో హామీలను గుర్తించి అధికారం చేపట్టాక వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు సూపర్ సిక్స్ పథకాల్లో ఆరు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని మహిళలకు 18 ఏళ్లు నిండిన వారికి ప్రతినెల 1500 రూపాయలు ఇస్తామని అమ్మవారి కింద ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఇస్తామని నిరుద్యోగ భృతి ఇస్తామని, రైతు భరోసా కింద కేంద్ర ప్రభుత్వం సంబంధం లేకుండా ప్రతి రైతుకు 20,000 ఇస్తామని ఇటువంటి హామీలను ఇచ్చి తీరా అధికారం చేపట్టాక హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచన చేశారని ఇదంతా ప్రజలు గమనించాలని కూటమి రెండేళ్ల పాలనతోనే విసిగిన ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలన ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కర్నూల్ నియోజకవర్గం పరిశీలకులు జిల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటు పాలనపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 104 అర్జీల స్వీకరణ






**"ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమానికి విశేష స్పందన**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు**


**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 12 నంది పత్రిక** ప్రజల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఒకసారి వచ్చిన అర్జీని నాణ్యతతో పరిష్కరించడం ద్వారా అదే అర్జీదారుడు మళ్లీ మళ్లీ అదే సమస్యపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా చూడటమే ప్రత్యేక పీజీఆర్ఎస్ ముఖ్య ఉద్దేశ్యమని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం భీమవరం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించగా, భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమం ద్వారా ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను స్వీకరిస్తున్నారని తెలిపారు. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. నేటి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 104 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో భీమవరం అర్బన్ నుంచి 36, భీమవరం రూరల్ నుంచి 30, వీరవాసరం మండలం నుంచి 38 అర్జీలు అందినట్లు వివరించారు. ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రేషన్ కార్డులు, భూమి రీ-సర్వే, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చినట్లు పేర్కొన్నారు. అర్జీలను పరిశీలించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముగింపు చేయరాదని అధికారులను ఆదేశించిన కలెక్టర్, సేవాభావంతో, సానుకూల దృక్పథంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తమ పరిధిలో లేని అంశాలపై అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించి, అవసరమైతే ప్రభుత్వానికి నివేదించాలని తెలిపారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జూన్ 12వ తేదీ వరకు భీమవరం నియోజకవర్గంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పి జి ఆర్ ఎస్ ద్వారా 7,669 దరఖాస్తులు స్వీకరించగా, వాటిలో 6,678 దరఖాస్తులు పరిష్కరించబడినట్లు తెలిపారు. ఇంకా మిగిలివున్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. భీమవరం ఎమ్మెల్యే, ఏపిపిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలకు క్షేత్రస్థాయిలో వేగవంతంగా, నాణ్యమైన పరిష్కారం అందించే అవకాశం కలుగుతోందన్నారు. అందిన ప్రతి అర్జీని అధికారులు పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. నేడు స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలతో వచ్చే సమావేశానికి హాజరు కావాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో వీరవాసరం మండలం బాలేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వ భూమి కేటాయింపు కోసం, భీమవరం పట్టణానికి చెందిన మహిళ భూమి రీ-సర్వే కోసం, అగ్నిప్రమాదంలో ఆధార్ కార్డులు కోల్పోయిన కుటుంబం తిరిగి ఆధార్ కార్డుల జారీ కోసం, విద్యుత్ స్తంభం పునరుద్ధరణ, వృద్ధాప్య పింఛన్ల మంజూరు తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎ.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లలో వేగం పెంచాలి

**వర్షాకాలంలో ప్రజారోగ్య రక్షణకు అప్రమత్తంగా ఉండాలి**

**స్వచ్ఛ పదం, త్రాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 12(నంది పత్రిక):-** గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లు, స్వచ్ఛ పదం కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ, త్రాగునీటి నిర్వహణ తదితర అంశాలపై స్పెషల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యోగులు చాలా కాలంగా జీతాలు, పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో గ్రంథాలయ సెస్ బకాయిల చెల్లింపులను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసే పన్నులలో గ్రంథాలయ సెస్‌ను సకాలంలో చెల్లించి బకాయిలను పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. వచ్చే వారంలో నిర్వహించే సమీక్ష నాటికి పురోగతి కనిపించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ప్రతి బుధవారం తప్పనిసరిగా నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ఆలయ మార్గాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుని నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. త్రాగునీటి సరఫరా వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ క్లోరినేషన్ ప్రక్రియను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం, నీటి నమూనాలను పరీక్షించడం ద్వారా డయేరియా, ఫుడ్ పాయిజనింగ్ వంటి వ్యాధులను నివారించాలని ఆదేశించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ కోసం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఆధారంగా సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా, మండల స్థాయి కమిటీలు సమర్థవంతంగా పనిచేసి కుటుంబాల వివరాలను పరిశీలించి ఖచ్చితమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా త్రాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, స్వచ్ఛ రథం వంటి మౌలిక సేవలపై ప్రజల్లో సంతృప్తి పెరిగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. విద్యుత్ సమస్యల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలకు మరింత నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు..

# నూతన విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి






**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నాగరాణి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 12 నంది పత్రిక** నేటి నుండి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలలు తిరిగి ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం చిన్నఅమీరం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మిక సందర్శించారు. పాఠశాల తొలి రోజు ఏర్పాట్లు, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్నం భోజనం పథకం మెనూ పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కొద్ది సమయం ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా జిల్లాలోని విద్యార్థులందరికీ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వేసవి సెలవులను ఆనందంగా గడిపిన విద్యార్థులు నూతన విద్యా సంవత్సరంలో నూతన ఆశయాలు, లక్ష్యాలతో విద్యాభ్యాసాన్ని ప్రారంభించాలని ఆమె ఆకాంక్షించారు. వేసవి సెలవుల కాలంలో అనేక మంది విద్యార్థులు వివిధ వేసవి శిబిరాలు, శిక్షణా కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను, నైపుణ్యాలను పెంపొందించుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. సెలవులను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి ఉత్సాహంతో పాఠశాలలకు హాజరై విద్యాభ్యాసంలో రాణించాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ఆనందంగా పాఠశాలలకు రావాలని, విద్యను ఆసక్తితో అభ్యసించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి జీవితంలో సమయపాలన, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమైనవని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి వాటిని అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని, అర్థం కాని విషయాలపై సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సహ విద్యార్థులతో పరస్పర సహకారం, స్నేహభావంతో మెలగాలని, మంచి సంబంధాలను పెంపొందించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల, ఇల్లు మరియు పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకొని ప్రతి అంశాన్ని విశ్లేషణాత్మకంగా ఆలోచించే అలవాటు పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ ఫెయిర్లు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు వంటి సహపాఠ్య కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాల అవసరాలను గుర్తించి భవిష్యత్తు అవకాశాలకు అనుగుణంగా తమను తాము సన్నద్ధం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవడం, గ్రంథాలయాల్లోని పుస్తకాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వంటి సాంకేతిక వనరులను విద్యా అవసరాలకు ఉపయోగించుకోవాలని, అయితే అధిక స్క్రీన్ టైమ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని పేర్కొన్నారు. పెద్దలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని, ప్రతి విద్యార్థి ఈ విలువలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. అలాగే డ్రగ్స్, మత్తు పదార్థాలు మరియు ఇతర హానికర అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావడం ద్వారా సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన "స్వర్ణాంధ్ర2047" లక్ష్యసాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిజాయితీ, క్రమశిక్షణ, సహనం, పట్టుదల, నిరంతర కృషి వంటి విలువలను జీవితంలో ఆచరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థులు తమ కుటుంబానికి, పాఠశాలకు, గ్రామానికి లేదా పట్టణానికి, జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆశిస్తూ నూతన విద్యా సంవత్సరం సందర్భంగా మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని ప్రతి విద్యార్థి ఈ విద్యా సంవత్సరంలో విద్యతో పాటు విలువలను, నైపుణ్యాలను, సామాజిక బాధ్యతను పెంపొందించుకుని ఆదర్శ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారుచివరిగా విద్యార్థులను అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ప్రధానోపాధ్యాయురాలు వేగేశ్న అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు..





**అన్ని విభగాధిపతులతో సమీక్ష సమావేశం లో పాల్గొన్న ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపెరిండెంట్ కే వెంకటేశ్వర్లు**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూలు సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు గారు అన్ని విభాగాధిపతులతో (హెచ్ ఓ డి ) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై పలు కీలక అంశాలను చర్చించారు.రోగులకు అవసరమైన పరీక్షల శాంపిల్స్ మరియు మందులను అనవసరంగా బయటకు రాయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.మందులను తప్పనిసరిగా బయటికి రాయాల్సి వస్తె తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.అలాగే నెక్స్ట్ జెన్ ఈ-హాస్పిటల్ వెబ్‌సైట్‌లో పలు విభాగాల పనితీరు శాతం తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పీజీలు మరియు ఇంటర్న్‌లకు అవగాహన కల్పించి శాతాన్ని పెంచవచ్చు అని సూచించారు.అదేవిధంగా అన్ని విభాగాలు ఓపి సమయాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆసుపత్రిలో శానిటేషన్ బిన్స్ లేదా కవర్ల కొరత ఉన్నా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన పలు చర్యలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కె వెంకటేశ్వర్లు తో పాటు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్స్ పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు



**వెలుగోడు, జూన్ 13 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించారా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు శుక్రవారం పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు.పీఆర్ క్వాలిటీ కంట్రోల్ డీఈ సుధాకర్ రెడ్డి ఆ మేరకు క్వాలిటీ కంట్రోల్ ఏఈ రాముడు, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బృందం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పీఆర్ ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వెలుగోడు పట్టణంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2 కోట్లతో 14 ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్ల నిర్మాణ నాణ్యతను నిర్ధారించేందుకు గత రెండు రోజులుగా శాంపిల్స్ సేకరిస్తున్నామని, సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించిల్యాబ్ నివేదిక ఆధారంగా నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో వెలుగోడు టిడిపి అధ్యక్షులు ముల్లా అబ్దుల్ కలాం, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

# ఎన్డీఏ ప్రభుత్వంలో సీట్ చోరీ జరుగుతుంది

**ఓటు చోరీ నుండి సీటు చోరీ**

**జెన్ జీ యువతకు కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతం**

**నీట్ లీకు, సీబీఎస్ఈ స్కాం, నిరుద్యోగం తో దేశంలోని యువతలో ఆందోళన**

**యువత కోసం, జిల్లా అభివృద్ధి కోసం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రత్యక్ష పోరాటం**

**కర్నూల్ డిసిసి అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** నేటి ఎన్డీఏ బిజెపి ప్రభుత్వంలో సీట్ చోరీ జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ అభిప్రాయపడ్డారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఓట్ చోరీ, సర్కార్ చోరీ, ఇప్పుడు సీట్ చోరీ, జరగడం జరిగింది అని అన్నారు. మధ్యప్రదేశ్లో మీనాక్షి నటరాజన్ సబ్మిట్ చేసినటువంటి అప్లికేషన్ ను రిజెక్ట్ చేశారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. దీన్ని మేము సుప్రీంకోర్టులో కూడా చాలెంజ్ చేయడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ ద్వారా దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దేశంలో ఇప్పటికి చూస్తూనే ఉన్నాం నీట్ పేపర్ లీకేజ్ కావచ్చు ఈరోజు కాంగ్రెస్ పార్టీ జెంజీ పార్టీ వాళ్ళందరినీ కూడా ఆహ్వానించడం జరిగింది. మీరు ఎక్కడికో వెళ్లి మిస్సయిడ్ అవ్వాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ తరుపున మీరు పోరాటం చేయండి.



మనమందరం కూడా కలిసి పోరాటం చేద్దాం దేశంలో ఎక్కడ చూసినా కూడా నిరుద్యోగం డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం, గ్యాస్ సరిగ్గా అందుబాటులో ఉండకపోవడం ప్రతి ఒక్కరు కూడా పరివారన పరిరక్షణమంటున్నారు గానీ ఎవరు కూడా సహకరించట్లేదు మొన్న టీజీ భరత్ గడియారం హాస్పిటల్ దగ్గర ఉన్న చెట్టును కొట్టివేసి ఆ స్థలంలో ట్రాన్స్ఫార్మర్ కట్టాలి అని చెప్పేసి నడిరోడ్డు మీద పెట్టారు దీనితో అక్కడున్నటువంటి వ్యాపారస్తులు హాస్పిటల్ సిబ్బంది చుట్టుపక్కల వాళ్ళు చెట్టు నీడకి ఉండేవాళ్ళు ఇప్పుడు ఆ చెట్టుకొట్టి వేయడంతో చాలా బాధపడుతున్నారు. కొత్త పెన్షన్ ఇస్తామన్న ప్రభుత్వం కొత్త పెన్షన్ ఇవ్వట్లేదు. రాష్ట్రంలో ఉద్యోగాల పరిస్థితిలోనే స్కాములు జరుగుతున్నాయి. అంటే ఇంకా మనకు ఎక్కడ చూసినా స్కాములు కనిపిస్తున్నాయి. అప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి అని నేను ప్రశ్నిస్తున్నాను. మన ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా ఏది అంటే కర్నూలు జిల్లా అని నేను చెప్తున్నాను. కర్నూలు జిల్లాలో పెట్టుబడులు తీసుకురాండి తీసుకురండి అని చెప్పేసి మేము చెప్తా ఉంటే ఇంతవరకు దానిమీద ఎటువంటి యాక్షన్ తీసుకోలేదు పట్టించుకోలేదు. గుండ్రేవుల ప్రాజెక్టు కావచ్చు వర్షాలు సరిగా పడక అదే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మనకి మన జిల్లాకి అది ఉపయోగపడేది అని క్రాంతి నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, డిసిసి మాజీ కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, వెల్దుర్తి శేషయ్య, కాంగ్రెస్ నాయకులు లోక రామయ్య ఐ ఎన్ టి యు సి మద్దిలేటి మొదలగువారు పాల్గొన్నారు.

# స్వల్ప వ్యయ నిర్వహణ పనులను వెంటనే చేపట్టాలి

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** కర్నూల్ నగర ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు వంటి ప్రాథమిక సేవల్లో స్వల్ప వ్యయంతో ఎక్కువమందికి ప్రయోజనం చేయగలిగే పనులను వెంటనే చేపట్టాలని నగరపాలక సంస్థ చల్లా ఓబులేసు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఏ.క్యాంపు చాణక్యపూరి కాలనీ, లక్ష్మీగార్డెన్స్, జొహరపురం, రాజేశ్వరి నగర్, ఎఫ్‌సిఐ కాలనీ, చల్లా వారి వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటి సరఫరాపై స్థానికులకు ఆరా తీశారు. పుష్‌కార్టుల మరమ్మత్తులు, నీటి సమస్య తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో పైప్‌లైన్ల అనుసంధానం వంటి నిర్వహణ పనులకు వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అదే విధంగా బళ్ళారి చౌరస్తా వద్ద బైపాస్ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ఎస్‌ఏపి క్యాంపులో పారిశుద్ధ్య కార్మికులకు యోగాసనాలు కార్యక్రమం కోసం వేదికను పరిశీలించారు. రాజేశ్వరి నగర్ పార్కులో బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అన్న క్యాంటీన్ పరిశీలించారు. స్వచ్ఛత నాణ్యతపై ప్రజలతో మాట్లాడారు. బయట వరండాలో 12 టేబుల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డిఈఈ నరేష్, ఏఈ జనార్ధన్, శానిటేషన్ ఇంస్పెక్టర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



# 32వ స్వర్ణ వార్డును పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి

**స్వర్ణ వార్డు సేవలపై సమీక్ష.. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని**

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూన్ 12(నంది పత్రిక)::-** ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం నంద్యాల పట్టణంలోని 32వ స్వర్ణవార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డులో అందిస్తున్న వివిధ పౌర సేవలు, ప్రజల నుండి స్వీకరిస్తున్న దరఖాస్తుల పరిష్కార విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్వర్ణవార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల వివరాలు, సంక్షేమ పథకాల అమలు తీరు, ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వ్యవస్థపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఆశ్రయిస్తున్నందున ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణవార్డు పరిధిలోని కుటుంబాల వివరాలు, పథకాల అర్హతలు, సేవల డెలివరీ స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. స్వర్ణవార్డులో నిర్వహిస్తున్న రికార్డులు, ఫైళ్ల నిర్వహణ, కార్యాలయ పరిశుభ్రత, ప్రజలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డుకు వచ్చిన పలువురు స్థానికులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ద్వారానే చేరుతున్నందున ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.



# నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం..



**మహానంది జూన్ 12 (నంది పత్రిక):-** నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు మహానంది ఎస్ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..ఈనెల 9వ తేదీన మహానంది దేవస్థానం వెనుక భాగాన నిలిపి ఉంచిన పల్సర్ మరియు హెచ్ ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిళ్ళు చోరీకి గురి అయినట్లు ఎస్ఐ తెలిపారు. వీటితోపాటు నంద్యాల 3 టౌన్ పరిధిలో ఒక మోటార్ సైకిల్ ఆళ్లగడ్డ పరిసర ప్రాంతంలో ఒక మోటార్ సైకిల్ చోరీకి గురికాగా ఈ నాలుగింటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పాత్తి గోపి నాయక్ (19)ఎంఎస్ నగర్ నంద్యాల, మేనుగ రాజు (25) ఎన్జీవో కాలనీ నంద్యాల షరీఫ్ నగర్, దొడ్డగాళ్ల ప్రకాష్ (21) చిన్న మల్కాపురం డోన్( ప్రస్తుతం గోస్పాడు మండలం యాలూరు నివాసం), షేక్ షాబీర్ హుస్సేన్(19) నాగుల కట్ట దేవ నగర్, నంద్యాల కు చెందిన నాలుగురు ముద్దాయిలను నంద్యాల గిద్దలూరు రహదారిలోని నందిపల్లె మెట్ట వద్ద అరెస్టు చేసి వారి నుండి 4 మోటర్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. వీటి విలువ దాదాపు 2, 70 వేల రూపాయలు ఉంటుందన్నారు. ముద్దాయిలు మద్యానికి బానిసయి మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడినట్లు ఎస్సై రామ్మోహన్ రెడ్డి తెలిపారు.నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మరియు ఏఎస్పి మంద జావలి ఆల్ఫోన్స్,ముద్దాయిల అరెస్టుకు సంబంధించి సిబ్బందిని అభినందించారని ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి

**ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**ఈ నెల 15 నుంచి ఇంటింటికీ బీఎల్‌వోలు**

**అర్హులైన ఏ ఒక్క ఓటు తొలగించబడదు**

**పత్రాలు, వివరాలను ప్రజలు ఇప్పుడే సిద్ధం చేసుకోవాలి**

**నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేష్**

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - ఎస్ఐఆర్)ను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), ప్రజలు సమిష్టిగా సహకరించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. శుక్రవారం స్థానిక బాలాజీ నగర్‌లోని కర్నూలు కన్వెన్షన్ హాల్‌లో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీఎల్ఏలకు ఎస్ఐఆర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐఆర్ లక్ష్యాలు, విధివిధానాలు, బీఎల్ఏల పాత్ర, ప్రజల బాధ్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా, తప్పులులేనిదిగా రూపొందించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన



ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, నకిలీ లేదా ద్వంద్వ నమోదులను గుర్తించి సరిచేయడం ఈ ప్రక్రియలో భాగమన్నారు. అర్హత కలిగిన ఏ ఓటును తొలగించబడదని స్పష్టం చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఓటరికి రెండు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిని ఓటర్లు స్వయంగా పూర్తి చేసి బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. ఒక ఫారంపై బీఎల్‌వో సంతకం చేసి రసీదు రూపంలో ఓటరుకు తిరిగి అందజేస్తారని వివరించారు.ప్రజలు తమ ఈపిక్ (ఓటరు గుర్తింపు కార్డు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, కుటుంబ సభ్యుల ఓటరు వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. 2002 సంవత్సరానికి సంబంధించిన ఓటరు జాబితా వివరాలు, పోలింగ్ కేంద్రం నంబర్, పార్ట్ నంబర్, వరుస సంఖ్య, తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు, నానమ్మల ఈపిక్ వివరాలు అందుబాటులో ఉంటే మ్యాపింగ్ ప్రక్రియ మరింత సులభంగా జరుగుతుందని తెలిపారు. వివాహానంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ఇటీవల ఓటరుగా నమోదు చేసుకున్న వారు తమ కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.బీఎల్ఏలు ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అనంతరం పేర్లు, వివరాలు సరిచూసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని కోరారు. ఓటరు జాబితాలో చేర్పులు, సవరణలు, అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి సమర్పించాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి మూలాధారమైన ఓటరు జాబితా తయారీలో రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికల సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# విమల స్కూల్ లో ఘనంగా మనబడి మన పండుగ.

**భవిష్యత్ తరాలకు పునాది.**



**శిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని గోవిందపల్లె గ్రామంలో గల విమల స్కూల్ లో విద్యా సంవత్సరం పునః ప్రారంభం సందర్భంగా ప్రిన్సిపల్ గీతా సిస్టర్ ఆధ్వర్యంలో మనబడి మన పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విమల స్కూల్ లో ప్రతి విద్యార్థికి ఆహ్లాదకరమైన స్వాగతం పలుకుతూ నూతన విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు ఒక పండుగ వాతావరణంలో అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గీతా సిస్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలో అక్షరాలు పదాలు వాక్యాలు కూర్పులు వరకు నేర్పడమే చదువు కాదని అది ఒక భాగం మాత్రమే అని సమాజాన్ని చదవడం ఎలాగో సమాజంలో నిజాయితీగా ఉన్నతంగా ఎదగడం ఎలాగో సంపూర్ణ జ్ఞానాన్ని అందించడం కూడా ఎంతో అవసరం అన్నారు. ప్రకృతికి మనిషికి ఉన్న సంబంధాన్ని అనుబంధాన్ని నిరంతరం నేర్పుతూ రెక్కలు రాని చిన్నారి పక్షికి గూటిలో తల్లి రక్షణ కల్పించినట్లు బడిలో చిన్నారులకు రక్షణ అందించే తల్లి పక్షుల్లా ఉపాధ్యాయులు ఉంటారని అన్నారు. సమాజం పట్ల బాధ్యతగా మెలిగే పౌరులుగా తీర్చిదిద్దుతూ చిన్నారులకు అక్షర జ్ఞానాలు నేర్పుతూ వారి భవిష్యత్తుకు పునాది వేస్తున్నామని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

# దోమల నివారణకు హాస్టల్లో ఏ సీ ఎం ఆల్ఫా సైపర్ మెత్రిన్ పిచికారి

**బద్వేల్, జూన్ 12:(నంది పత్రిక** )బద్వేలు పట్టణంలోని కోటవీధి పరిధిలో గర్ల్స్ హాస్టల్ ఒకటి, రెండు , ఎస్సీ బాలర హాస్టల్, బీసీ హాస్టల్, కాలేజీ గర్ల్స్ హాస్టల్ ,కాలేజీ బాయ్స్ హాస్టల్ ,నందు దోమల నివారణకై ఎన్ వి బి డి సి పి మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ హాస్టల్లో పిచికారి చేయించడం జరిగింది.అనంతరం కోటవీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది దోమల కొట్టకుండా దోమల పుట్టకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతను శుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, తొట్లు వారానికి ఒక గంట సేపు ఆరబెట్ట కోవడం వల్ల లార్వా ఉత్పత్తి కాకుండా నిరోధించవచ్చని, అలాగే దోమల కొట్టకుండా మనం పాటించవలసిన జాగ్రత్తలు దోమతెరల్లో నిద్రించడం వేపాకు పొగ వేసుకోవడం వల్ల దోమల కొట్టకుండా కాపాడుకోవచ్చు అలాగే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందువలన బయట పొలంలో పనులు చేసే రైతులు గాని వడదెబ్బ గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని ఉదయం పది గంటల లోపల సాయంత్రం ఐదు గంటల తర్వాతనే బయట పనులు చేసుకోవాలని వడదెబ్బ తగిలిన తర్వాత ప్రాథమికంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఖఅఎ, ం ఆశా దగ్గర ఉన్నాయని తెలియజేయడమైనది. హెల్త్ అసిస్టెంట్ శ్రీ రామయ్య మాట్లాడుతూ ప్రతి సోమవారం వెక్టార్ కంట్రోల్ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే యాప్ లను ఏఎన్ఎమ్స్ అప్లోడ్ చేయాలని తెలియజేయడమైనది. హెల్త్ అసిస్టెంట్ జనార్ధన రావు మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటింటా లార్వా సర్వేలు ఫీవర్ సర్వేలు చేపడుతున్నామని ఎక్కడ కూడా డెంగు మలేరియా చికెన్ గునియా బోధకాలు మెదడువాపు వ్యాధులకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కావడం లేదని తెలియజేయడం జరిగింది.. హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జూన్ నెల ఒకటి నుండి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జరుగుతున్నందున పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఎవరికైనా జ్వరాలు వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి పోయి రక్త పరీక్షలు వైద్యం చేయించుకోవాలని అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోటవీధి గర్ల్స్ హాస్టల్ వార్డెన్స్ లక్ష్మీదేవి, సంపూర్ణమ్మ, ఏఎన్ఎంస్ స్వాతి, ఆశ అనిత,హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రక్తదాతలను ప్రోత్సహించి ప్రాణదాతలుగా నిలవాలి





## స్వచ్ఛంద రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చు జిల్లా కలెక్టర్ & ఐ.ఆర్.సి.ఎస్ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 12 నంది పత్రిక** రక్తదానం మానవత్వానికి ప్రతీక అని, రక్తదాతలను ప్రోత్సహించి మరింత మంది ప్రాణదాతలుగా ముందుకు వచ్చేలా సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, రక్త సేకరణ మరియు రక్తదాతల ప్రోత్సాహకులకు సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ & జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, బ్లడ్ బ్యాంకులు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంకులు, యువజన సంఘాలు, విద్యాసంస్థల సహకారంతో ఉచిత రక్తదాన శిబిరాలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. "రక్తాన్నివ్వండి ప్రాణాలను కాపాడండి" అనే నినాదంతో ముందుకు వచ్చి సేవలందిస్తున్న ప్రతి రక్తదాతను కలెక్టర్ అభినందించారు. మనం ఇచ్చే ప్రతి రక్తపు చుక్కలో మానవత్వంతో పాటు మరొకరి జీవితాన్ని నిలబెట్టే బాధ్యత దాగి ఉందని అన్నారు. ఆధునిక వైద్య రంగం ఎన్నో అద్భుత పురోగతులు సాధించినప్పటికీ, మానవ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం ఇప్పటికీ సాధ్యం కాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాలు, ప్రమాదాలు, క్యాన్సర్, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం ప్రాణాలను కాపాడే సంజీవని వంటిదని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి వ్యక్తి, ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా, క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని వివరించారు. జూన్ 14న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కలెక్టర్ కోరారు. రక్తదాన కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద రక్తదానం ఒక మహోన్నత సామాజిక సేవ అని, ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. రక్తదాన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, అధిక మొత్తంలో రక్త సేకరణకు కృషి చేసిన వివిధ శాఖల అధికారులు, విద్యాసంస్థలు, బ్యాంకులు మరియు ప్రచార విభాగ ప్రతినిధులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. రక్తదాన కార్యక్రమాల ప్రోత్సాహం మరియు రక్త సేకరణలో విశేష కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్. వేణుగోపాల్, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం. ఏసు బాబు, శశి ఇన్స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ సంస్థ అధినేత సాల్మన్, తాడేపల్లిగూడెం ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఓ బ్రాంచ్ మేనేజర్ మెహర్ బాబా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధి, తదితరులను జిల్లా కలెక్టర్ దుశ్యాలువాలతో సత్కరించి మెమొంటో, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్. బద్రిరాజు, వైస్ చైర్మన్ ఓబిలిశెట్టి కనకరాజు, జిల్లా కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు జి.ఎం. కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు మరియు యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

## "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో ప్రభుత్వ విధానాలపై నిరసన



**ఆత్మకూరు, జూన్ 13 (నంది పత్రిక):** శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించగా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ర్యాలీతో ఆత్మకూరు పట్టణం హోరెత్తింది. నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి ప్రారంభమైన ర్యాలీ గౌడ్ సెంటర్ వరకు కొనసాగింది. నిరసనలో భాగంగా ఎన్నికల సమయంలో విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టో, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సంతకం చేసిన హామీ బాండ్లు, సంబంధిత పత్రాల ప్రతులను దహనం చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందుకు ఈ ర్యాలీకి తరలివచ్చిన ప్రజలే నిదర్శనమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతకు ఆశలు కల్పించి, ఇప్పుడు వారిని నిరాశకు గురిచేశారని విమర్శించారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగార్థులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మహిళలకు ఆడబిడ్డ నిధి, యువతకు నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీ ఎప్పుడు ::కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇచ్చే కిట్స్ ఆలస్యానికి కారణం ప్రభుత్వ అలసత్వమా? ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు శాపంగా మారకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. కర్నూల్ నగరంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ2025-26 ఏడాది తెలుగులో పిల్లలు తడబాటు తో ఎక్కువమంది ఫెయిల్ ఆందోళనకు గురి చేసినట్లు అయ్యిందన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫామ్ క్లాత్, స్కూల్ బ్యాగ్, రెండు జతల సాక్సు, ఒక జత బూట్లు పిల్లలకు అందజేయాలని కోరారు. భారత దేశంలో నీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారిక భాష తెలుగులో2026-27 సంవత్సరంలో చదివే పిల్లలు తడబాటు కు లోనకాకుండా తెలుగులో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్రెమ్మ,బీసమ్మ, నారాయణమ్మ,నాగమద్దమ్మ, అత్తరి బి, షబానా తహరాభి జాఫర్ బి లాతీఫ్ షాల్మియా తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం




## రాష్ట్ర ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు
## సూపర్ సిక్స్ పథకాల హామీల పేరుతో ప్రజలను వంచించారు
## వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్త కాదు
## రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపివేసిన ఘనత చంద్రబాబుదే
## నియోజకవర్గంలో ఏ పనికైనా కప్పం కట్టాల్సిందే
## ప్రజలంతా గమనించి రాబోయే ఎన్నికల్లో వైసీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 12 నంది పత్రిక** రాష్ట్ర ప్రజలను సూపర్ సిక్స్ పథకాల హామీల పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు వంచించి వెన్నుపోటు పొడిచారని మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజెటంద్రారెడ్డి, రాష్ట్ర వైకాపా కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డిలు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని నిరసిస్తూ శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలో వైకాపా ఆధ్వర్యంలో వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి భారీ సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ శాసన మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం కొత్త కాదన్నారు. ఆనాడు వాళ్ల మామకు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారని.. 2014లో ప్రజలకు రుణమాఫీ చేస్తామని చెప్పి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. రైతు భరోసా అమలు చేయలేకపోయారని, అర్హులకు సంక్షేమ పథకాలు అందించలేకపోయారని, డీఎస్సీలో అర్హులైన నిరుద్యోగులను మోసం చేశారని ఆయన ఆరోపించారు. ప్రజలు చంద్రబాబు మాయలో పడి మోసపోయారని ఇప్పటికైనా ఆలోచన చేసుకోవాలన్నారు. సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే గంగులనాని మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక పథకాలు అమలు చేయలేక ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైకాపాను గొడ్డలి పార్టీ అంటూ తెదేపా వారు విమర్శిస్తున్నారని ప్రజలను వెన్నుపోటు పొడిచిన మీ పార్టీని వెన్నుపోటు పార్టీగా మేము నామకరణం చేస్తున్నామని గంగుల అన్నారు . ఇక ఆళ్లగడ్డ విషయానికొస్తే నియోజవర్గంలో ఏ పనికైనా కమిషన్ ఇవ్వనిదే ముందుకెళ్లే లేని పరిస్థితులు నెల కొన్నాయన్నారు. తాలుకాలో జరుగుతున్న దుర్మార్గాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని వచ్చే స్థానిక సంస్థల్లో అన్ని స్థానాలకు పోటీ చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వైకాపా కార్యదర్శి భూమా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు వస్తున్నారంటే ఆయన వెంట దొంగల ముఠా వస్తుందని దోచుకునేవారు వస్తారని ఆరోపించారు. నియోజకవర్గాల్లో బాదుడే బాదుడు కార్యక్రమం జరుగుతోందని ఉచిత పేరుతో 7,500, మన్ను తీసుకోవాలన్న కప్పం కట్టాల్సిందేనని ప్రతి దానికి డబ్బు ఇవ్వనిదే పని కావడం లేదని ఆరోపించారు. ఎమ్మార్వో కార్యాలయాల్లో లంచాలు ఇవ్వనిది పని కావడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలని తెదేపా వాళ్ళ తాటాకుల చప్పుళ్లకు ఎవరు భయపడరని వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల నుండి దోచుకున్న సొమ్మును కక్కిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ బాబూలాల్, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి మాజీ ఎంపీ వీరభద్రుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి ప్రసంగించారు. ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయం నుండి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నాలుగు రోడ్ల సెంటర్కు చేరుకుంది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గంగుల నాని పూలమాలలు వేసి నివాళులర్పించారు., మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, సిరివెళ్ల సలాం, మాజీ కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, అరికట్ల శివరాంరెడ్డి, డాక్టర్ శీలం సురేంద్ర నాథ్ రెడ్డి, కేకే, గంగుల రామిరెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి , సిద్ధం రెడ్డి భాస్కర్ రెడ్డి, మాదం చెన్నయ్య ,మాదం కిషోర్, మైనారిటీ నాయకుడు అల్లా బకాష్, హుస్సేన్ రెడ్డి, నాగిరెడ్డి పల్లె శంకర్ రెడ్డి ,తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ వీరేష్ నాయుడు జన్మదిన వేడుకలు

### పచ్చని పంట పొలాల్లో జన్మదిన వేడుకలు.



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ వీరేష్ నాయుడు జన్మదినం పురస్కరించుకొని మిత్రులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. శుక్రవారం ఆదోని మండల పరిధిలోని జాలమంచి గ్రామంలో నాగరాజ్ పంట పొలాలలో వీరేష్ నాయుడు జన్మదిన వేడుకలను మిత్రులు విరుపాక్షి రెడ్డి, తెలుగుదేశం రాష్ట్ర బీసీ సాధికార ప్రతినిధి చాగి మల్లికార్జున్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ నెట్టేకల్ టిడిపి సీనియర్ నాయకులు మహేష్ యాదవ్, రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగేంద్ర, జీకే క్లినిక్ అధినేత జీకే వీరేష్, జాలమంచి గ్రామ నివాసి తిక్కయ్య, పెద్ద తుంబలం రామ్మూర్తి, టిడిపి నాయకుడు శుక్రవారం పేట శివ, నెట్టేకల్ వీరారెడ్డిల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా వీరేష్ నాయుడు జన్మదిన పురస్కరించుకుని ఆయనకు మిత్రులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చాగి మల్లికార్జున రెడ్డి, మహేష్ యాదవ్ మాట్లాడుతూ తమ మిత్రుడు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆ దేవుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు వాళ్ళ తెలిపారు. ఇలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వీరేష్ కలకాలం వర్ధిల్లాలని వారందరూ దీవించారు.

## చదువుకునే వయసులో ఉన్న పిల్లలను బాల కార్మికులుగా మార్చొద్దు... మహిళా న్యాయవాది



**బనగానపల్లె జూన్ 12 నంది పత్రిక** తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల వలన ఇతర ఇబ్బందుల వలన చదువుకునే వయసు ఉన్న పిల్లలను బడికి పంపకుండా వారిని బాల కార్మికులుగా మార్చవద్దని బనగానపల్లె జూనియర్ కోర్టు న్యాయవాది తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు శుక్రవారం అంతర్జాతీయ బాల కార్మిక దినోత్సవం సందర్భంగా బనగానపల్లెలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు మండల ఎంఈఓ స్వరూప రాణి పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ చదువుకునే వయసులో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు కచ్చితంగా బడికి పంపాలని వారి బంగారు భవిష్యత్తుకు బాట వేయాలని పేర్కొన్నారు. ఈనాడు ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలు, ఎస్సి, ఎస్టీ ల కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చదువు మాన్పించి పనుల్లోకి పంపుతున్నారని ఇది ఎంత మాత్రం సమంజసం కాదని అన్నారు చదువుకునే వయసు ఉన్న ఆ పిల్లలను బాల కార్మికులు గా మార్చవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బడి ఈడు ఉన్న పిల్లలను బడికి పంపేందుకే ప్రభుత్వాలు కొన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని కచ్చితంగా తమ పిల్లలను బడికి పంపి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆమె కోరారు.

## యువత జీవిత క్రమశిక్షణ అలవార్చుకోవాలి.. మత్తుకు దూరంగా ఉండండి..ఎస్సై



**కోవెలకుంట్ల జూన్ 12నందిపత్రిక** యువత మత్తుకు అలవాటుపడి పెడదారిన పడకుండా జీవిత క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణం శ్రీరామ్ నగర్ కాలనీ నందు డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై యువకులు మద్యానికి డ్రగ్స్ కు జూదానికి మరియు మొబైల్ ఫోన్లకు అలవాటు పడి వారి వారి జీవితాలను నాశనం చేసుకునే విధంగా తయారవుతున్నారు, బైకు వాడే యువకులు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి రక్షణ కలుగుతుందని మద్యం తాగి మోటారు వెహికల్స్ నడపడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడడమే కాకుండా ఎదుటివారి కుటుంబాలు ఇబ్బంది పడి చిద్రమవుతాయని యువకుల తల్లిదండ్రులకు కోవెలకుంట్ల పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ మల్లికార్జున రెడ్డి సూచించారు . ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన యువకుల తల్లిదండ్రులు సురేంద్ర ఎమ్మార్పీఎస్ నాయకులు బోడెమ్మనూరు రాజు నిలువుగాండ్ల నవీన్ దండు రామసుబ్బయ్య ఆదిశేషులు దేవరాజు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కూటమిపాలన విజయోత్సవ సభలో పాల్గొన్న కర్నూల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** తిరుపతిలో నిర్వహించిన "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కూటమి పాలన విజయోత్సవ సభ అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహాసభకు కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ హాజరై కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలను ప్రజలతో కలిసి వేడుకగా జరుపుకున్నారు. గత రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించిందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు మరియు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక ప్రజాహిత కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ . చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల సృష్టి, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విశేష ఫలితాలను సాధించిందని ఆమె తెలిపారు.రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత సమర్థవంతమైన పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.ఈ విజయోత్సవ సభలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ఘనంగా జరుపుకున్నారు.



## ఎరువులు, విత్తనాలు, సబ్సిడీల పేరుతో వచ్చే నకిలీ సందేశాలు, ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దు.

**అధికారిక డి -క్రిషి , ఆపైమ్స్ ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే వినియోగించాలి.**

**వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు.**

**రైతులు, ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.**

**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలు, నాణ్యతలేని ఎరువులు, సబ్సిడీలు మరియు ప్రభుత్వ పథకాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం తెలిపారు.ఇటీవల కొందరు వ్యక్తులు నకిలీ, నాణ్యతలేని విత్తనాలను విక్రయిస్తూ రైతులను మోసగించేందుకు ప్రయత్నిస్తుండగా, మరోవైపు సైబర్ నేరగాళ్లు ఎరువుల పంపిణీ, సబ్సిడీలు, ప్రభుత్వ పథకాల పేరుతో నకిలీ సందేశాలు, ఫోన్ కాల్స్, వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు మరియు లింకుల ద్వారా రైతుల వ్యక్తిగత, బ్యాంకు వివరాలను సేకరించే ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. రైతులు విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్లు, గుర్తింపు పొందిన దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు సమయంలో ప్యాకెట్‌పై ఉన్న కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీ, ధృవీకరణ వివరాలను పరిశీలించి, తప్పనిసరిగా బిల్లు తీసుకుని భద్రపరచుకోవాలని పేర్కొన్నారు.విత్తనాల కొనుగోలు, నమోదు ప్రక్రియల కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన డి -క్రిషి యాప్‌ను మాత్రమే వినియోగించాలని, ఎరువుల కొనుగోలు కోసం అమలులో ఉన్న ఆపైమ్స్ (ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ ఇన్పుట్స్ మానేజ్మెంట్ సిస్టమ్ ) విధానాన్ని మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. అనధికార యాప్‌లు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ద్వారా వచ్చే సందేశాలను నమ్మరాదని హెచ్చరించారు.ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు, పాస్‌వర్డ్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయరాదని, ప్రభుత్వ శాఖలు ఎప్పుడూ ఫోన్ ద్వారా ఇటువంటి వివరాలను అడగవని గుర్తుంచుకోవాలని సూచించారు.సోషల్ మీడియా, వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వ్యక్తులు పంపిన ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు.సోషల్ మీడియా లేదా అనధికార వ్యక్తుల ద్వారా విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయరాదని సూచించారు.ప్రభుత్వ పథకాలు, ఎరువుల పంపిణీ, రైతు సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం కోసం సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను లేదా అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని రైతులకు సూచించారు.అనుమానాస్పదంగా కనిపించే నకిలీ విత్తనాలు, విక్రయాలు, మోసపూరిత సందేశాలు లేదా ఫోన్ కాల్స్ గురించి వెంటనే సమీపంలోని మండల వ్యవసాయ శాఖ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ . సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు. "అప్రమత్తతే రక్షణ. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అధికారిక ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే వినియోగిస్తూ, జాగ్రత్తగా వ్యవహరిస్తే రైతులు నకిలీ విత్తనాలు మరియు సైబర్ మోసాల బారిన పడకుండా ఉండగలరు" అని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

## ఘనంగా గీతా పరివార్ వేసవి శిబిరం ముగింపు

**బాలబాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి**

**ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌ఎస్‌ఎస్ నగర సేవా ప్రముఖ్ వి.వి. సత్యనారాయణ**

**కర్నూలు నగర సమాచారం:**

**నగరంలోని కేశవ మెమోరియల్ స్కూల్ నందు గీతా పరివార్ సంస్థ తరపున శ్రీమతి హేమలత ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన వేసవి శిబిరం (సమ్మర్ క్యాంప్)**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో** అత్యంత వైభవంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో బాలబాలికలచే ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో శిక్షణ పొందిన 20 మంది బాలబాలికలు భగవద్గీత శ్లోకాలు, కోలాటం, యోగాసనాలతో పాటు పలు నైతిక విలువలతో కూడిన అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఉపస్థితులను విశేషంగా ఆకట్టుకున్నారు.




**చిన్నారుల్లో సంస్కృతిని పెంపొందించడం అభినందనీయం:** ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కర్నూలు నగర సేవా ప్రముఖ్ శ్రీ వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, యోగా, సాంప్రదాయ కళలను నేర్పించడం ద్వారా వారిలో దేశభక్తి, సంస్కృతి పట్ల గౌరవం పెరుగుతాయన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ చిన్నారులకు ఇటువంటి ఉత్తమ శిక్షణ ఇచ్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు.

**ఘనంగా బహుమతుల ప్రధానం:**

శిబిరంలో చురుగ్గా పాల్గొని, ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు.ఈ ముగింపు వేడుకల్లో కేశవ స్మృతి మండలి ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీ సందిట మహేష్, ఆంధ్ర రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు వీరప్ప, కేశవ మెమోరియల్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయిని శ్రీమతి ఉష, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 19 మంది ఆర్‌ఎస్‌ఐలు కన్వర్షన్ కింద ఎస్‌ఐలుగా పదోన్నతి

**కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఎస్‌ఐలు**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆర్మ్డు రిజర్వ్డ్ లో ఆర్‌ఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల సివిల్ ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన 19 మంది శుక్రవారం కర్నూలులోని డీఐజీ రేంజ్ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ వారికి శుభాకాంక్షలు తెలియజేసి, పదోన్నతి అనంతరం మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రజలకు సత్వర న్యాయం అందించే విధంగా పోలీసులు కృషి చేయాలని తెలిపారు. క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలుగా పదోన్నతి (2009, 2012, 2015, 2018 బ్యాచ్ ల ) పొందిన 19 మంది అధికారులు పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు భారీ నిరసన కార్యక్రమం వైఎస్ఆర్సిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది.వైఎస్ఆర్సిపి కర్నూలు అసెంబ్లీ ఇంచార్జ్ ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజలు పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆర్ యస్ రోడ్డు నుంచి జిల్లా పరిషత్ వరకు భారీ ర్యాలీగా కొనసాగిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు "హామీలు అమలు చేయాలి",



"ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి" అంటూ నినాదాలతో కర్నూలు నగరాన్ని మార్మోగించారు. ఈ కార్యక్రమంలో

కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త బుట్టా రేణుక వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొని కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అన్యాయం జరిగితే వైఎస్ఆర్సిపి ఎప్పటికీ మౌనంగా ఉండదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు ప్రజల కోసం పోరాటం ఆగదు వైఎస్ఆర్సిపి ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలుస్తుంది ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తే బాగుంటుంది అని హెచ్చరించారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి.

**ఆదోనిలో పరేడ్ పరిశీలన.**

**ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి...**

**సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్**



**కర్నూల్ ప్రతినిధి నంది పత్రిక** సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ శుక్రవారం ఆదోనిలో పర్యటించి హోంగార్డుల పరేడ్‌ను పరిశీలించారు. విధుల నిర్వహణ, క్రమశిక్షణ, సంక్షేమం మరియు ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర కీలకమని పేర్కొంటూ, ప్రజలతోమర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్ , ఆర్ఐ పోతల రాజు పాల్గొన్నారు.

## రిపేర్ల పేరుతో చెరువులో నీరు ఖాళీ

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 12:** మరమ్మతుల పేరుతో చెరువులో నిండుగా ఉన్న నీళ్లను కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నీళ్లను బయటికి వదిలి వేస్తున్నారు. భూగర్భ జలాలను పెంచాలని లక్ష్యంతో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ జల రక్షణ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, కొందరు నాయకులు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. రైతు ప్రయోజనాలను పక్కనపెట్టి చెరువులో నీటిని వదిలేసి రైతుల పొట్ట కొట్టే విధంగా ప్రవర్తిస్తున్నారు. చెరువు మరమ్మతుల పేరిట నీటిని వదిలివేస్తూ ఉండటంతో రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు మైనర్ ఇరిగేషన్ అధికారులు కూడా స్వార్థపరులకు వంత



పాడుతున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బండి ఆత్మకూరు చెరువు నీటిని వదిలివేస్తూ ఉండటంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రిపేర్ల పేరుతో మరమ్మతుల అన్న సాకుగా తీసుకొని అక్రమార్జనకు పాల్పడే ప్రయత్నాలకు కొందరు తెరలేపుతున్నారని రైతులు చర్చించుకుంటున్నారు. చెరువులోని నీటిని పూర్తిగా వదిలేసి నేషనల్ హైవే రోడ్డుకు మట్టిని తరలించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటూ ఉన్నారు. అయితే చెరువులో తూములు రిపేర్లు అంటూ మైనర్ ఇరిగేషన్ అధికారులు పేర్కొంటూ ఉండటాన్ని రైతులు తప్పుపడుతున్నారు. చెరువులో నీరు గత రెండు రోజులుగా వృధాగా పోతూ ఉండటంతో భవిష్యత్తులో తమ ఆయకట్టు పొలాల పరిస్థితి ఏమిటి అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సముద్రంలో ప్రయాణించే నేవీ సైనికులు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారో తెలుసా?

నెలల తరబడి సముద్రంలో, బయటి ప్రపంచంతో పెద్దగా సంబంధం లేకుండా గడిపే నావికాదళ సిబ్బంది జీవితం ఎంతో కఠినంగా, సవాలుతో కూడుకున్నది. నిరంతరం కదులుతూ ఉండే నౌకలు, వేళాపాళా లేని విధులు, ఒత్తిడితో కూడిన పరిస్థితుల మధ్య వారి ఆరోగ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని కాపాడటంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో, సుదీర్ఘ ప్రయాణాల్లో అమెరికా నావికాదళ అధికారులు, సైనికులు ఎలాంటి ఆహారం తీసుకుంటారనే విషయంపై ఆసక్తికరమైన వివరాలు వెల్లడయ్యాయి. సాధారణంగా నౌక ప్రయాణం మొదలైన తొలి రెండు వారాల పాటు మాత్రమే తాజా పండ్లు, కూరగాయలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత నెలల తరబడి నిల్వ ఉండే ఆహార పదార్థాలపైనే ఆధారపడాల్సి వస్తుంది. టిన్ ఫుడ్, డ్రై ఫుడ్, ఫ్రోజెన్ పదార్థాలతోనే వారి భోజనం ముడిపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆరు రకాల ఆహార పదార్థాలు వారి మెనూలో తప్పనిసరిగా ఉంటాయని, ఇవి కేవలం పోషకాలను అందించడమే కాకుండా వారిలో స్ఫూర్తిని నింపుతాయని నివేదికలు చెబుతున్నాయి.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com